ప్రతి నిత్యం తాజా వార్తలతో నిజాలు నిగ్గు తేలుస్తూ, సమకాలీన అంశాలను విశ్లేషిస్తూ మున్ముందు మీ ముందుకు వస్తున్న అక్షరం తెలుగు దినపత్రిక

సుఫల అక్షరం
తెలుగు దినపత్రిక సామాన్యుడి అస్త్రం




ప్రకటనలకు (అడ్వర్టైస్‌మెంట్) కొరకు సంప్రదించండి

EDITOR & PUBLISHER: 9391690609, OFFICE: 7893003409.
aksharamtsnews@gmail.com .... www.aksharamtelugudaily.com



www.aksharamtelugudaily.com RNI NO: TELTEL/2018/75419

# సుఫల అక్షరం

సామాన్యుడి అస్త్రం / తెలుగు దినపత్రిక

SUPHALA AKSHARAM

FRIDAY 26TH JUNE 2026 EDITOR : SHAIK YACOOB PASHA PAGES : 12 VOLUME : 09 ISSUE : 100 COST : 3\- KHAMMAM, TELANGANA

శుక్రవారం 26 జూన్ 2026 ఎడిటర్ : షేక్ యాకూబ్ పాషా పేజీలు : 12 సంపుటి : 09 సంచిక : 100 వెల : రూ. 3/- ఖమ్మం, తెలంగాణ

CIRCULATED BY : ADILABAB,, A SIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULABMA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOODNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRICILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI


## వెనిజువెలాకు మోడీ ఆపన్నహస్తం

- సాయం అందిస్తామని ప్రకటన
- సాయం కోసం సిద్దంగా ఉన్నామన్న ట్రంప్

న్యూఢిల్లీ,జూన్25: వెనెజువెలాలో సంభవించిన వరుస భూకంపాలతో భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. ఇప్పటివరకు 32 మంది ప్రాణాలు కోల్పోగా.. 700 మంది వరకు గాయపడ్డారని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. రాజధాని

➤ మిగతా 2వ పేజిలో..

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు బీమా భరోసా

- కోటి ప్రమాద బీమా పథకం ప్రారంభం
- రాష్ట్రాభివృద్దిలో ఉద్యోగులే కీలకం
- అందుకే వారి సంక్షేమానికి పెద్దపీట
- రాష్ట్రాభివృద్ది కోసం ఉద్యోగులు కష్టపడాలి
- పన్నులు ఎగవేసే వారిని పట్టుకని వసూలు చేయాలి
- రవీంద్రభారతి వేదికగా బీమాపథకం ప్రారంభించిన సిఎం రేవంత్



హైదరాబాద్,జూన్25 రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి మరో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ రూ. 1 కోటి ప్రమాద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడంలో ఉద్యోగులదే కీలకపాత్ర అని సీఎం పేర్కొన్నారు. ఉద్యోగుల భద్రత, వారి కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో బీమా పథకాన్ని గురువారం సాయంత్రం సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ, ప్రమాద బీమా పథకాన్ని తొలిసారిగా సింగరేణిలో ప్రారంభించామన్నారు. 45 మంది కార్మికుల కుటుంబాలకు బీమా సాయం అందించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. తాను కూడా మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినేనని, ఉద్యోగుల సమస్యలు, వారి అవసరాలు తనకు బాగా తెలుసని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అందరికీ భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు.

తాను దొరను కాదని, ప్రజల మధ్య నుంచి ఎదిగిన వ్యక్తినని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు. మంత్రివర్గానికీ తానే మేస్త్రీ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎవరు అవహేళన చేసినా పట్టించుకోనని, రేవంతన్నగా ➤ మిగతా 2వ పేజిలో..

## పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు

- క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు
- జూన్ 28లోగా లొకేషన్ల ఖరారు
- జూలై మొదటి వారంలో బ్రోచర్ విడుదల
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

2వ పేజిలో..

## ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు అంకురార్పణ

- ఈ ఏడాది 'పంచముఖ సంకటహర మహాగణపతి'
- నిర్జల ఏకాదశి పర్వదినంతో కర్రపూజ నిర్వహించిన ఉత్సవ కమిటీ

➤ 2వ పేజిలో..




## ఒకటో తేదీనే జీతాలు..

- ఉద్యోగులకు 'ప్రజా ప్రభుత్వం' బంపర్ ఆఫర్
- ఒక్క రూపాయి భారం లేకుండా రూ కోటి 25 లక్షల ఉచిత ప్రమాద బీమా
- విమాన ప్రమాదమైతే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు రక్షణ
- కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ సిబ్బందికీ వర్తింపు
- దేశ చరిత్రలోనే తొలిసారి ..త్వరలోనే 'క్యాష్‌లెస్' హెల్త్ కార్డ్స్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



## వెనిజువెలాను వణికించిన వరుస భూకంపాలు

- 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూప్రకంపనలు
- నేలమట్టం అయిన భారీ భవనాలు..ఇళ్లు, భవన సముదాయాలు
- ప్రాథమిక సమాచారం మేరకు 32 మంది మృతి
- దాదాపు శతాబ్దకాలం తరవాత అతిపెద్ద భూకంపంగా నమోదు
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన అధ్యక్షురాలు రోడ్రిగేజ్

కారకాస్,జూన్25: వెనిజువెలాలో కేవలం నిమిషం తేడాలో రెండుసార్లు భారీ భూకంపం వణికించింది. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వెనిజువెలాలో రెండుసార్లు భూమి కంపించింది. తొలుత రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.2 కాగా, ఆ తర్వాత 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. ఆ భూకంపాల

➤ మిగతా 2వ పేజిలో..



## తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు

- రూ.51 కోట్లతో 33 కొత్త గేట్ల ఏర్పాటు
- మూడు రాష్ట్రాల సిఎంలు కలసి ప్రారంభం
- కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పాటిల్
- ఒకేవేదికపై డికె, చంద్రబాబు, రేవంత్

బళ్లారి,జూన్25 కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన

➤ మిగతా 2వ పేజిలో..

## పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంచిన కేంద్రం

- జూలై 1నుంచి కొత్త ఫీజులు అమలు




న్యూఢిల్లీ,జూన్25: కేంద్రం తాజాగా పాస్‌పోర్టు ఫీజులను పెంచింది. కొత్త ఫీజులు వచ్చే నెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. కేంద్రం ప్రకటన ప్రకారం, 18 ఏళ్లు పైబడిన వారు కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) లేదా పాస్‌పోర్టు రీఇష్యూ కోసం ఇకపై రూ. 2,500 చెల్లించాల్సి ఉంటుంది. గతంలో

➤ మిగతా 2వ పేజిలో..

# వెనిజువెలాకు మోడీ ఆపన్నహస్తం

నగరం కరాకస్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంప తీవ్రత ధాటికి భవనాలు కూలిపోవడంతో.. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తు సమయంలో ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ఆపన్నహస్తం సాచాయి. వెనెజువెలా ప్రకృతి విలయంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ దేశానికి అండగా ఉంటామని ఎక్స్ వేదికగా వెల్లడించారు. సహాయసహకారాలు అందిస్తామని ప్రకటించారు. వెనెజువెలా ప్రజలకు సహాయం చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ట్రూత్‌లో పోస్టు పెట్టారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేలా సంసిద్ధంగా ఉండాలని అన్ని ఏజెన్సీలను ఆదేశించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వెనెజువెలా ప్రజలను గొప్ప స్నేహితులుగా అభివర్ణించారు. ఇప్పటికే సహాయక బృందాలను మోహరించామని అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో వెల్లడించారు.

## తుంగభద్రానదికి 33 కొత్తగేట్లు

వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. ఈ కార్యక్రమంలో మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రులు గురువారం మధ్యాహ్నం ప్రారంభించారు. రూ.51కోట్లతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన 33 కొత్త స్పీల్ వే గేట్లను ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, శివకుమార్ కలసి ప్రారంభిండం విశేషం. ఈ కార్యక్రమానికి కేంద్ర జలశక్తి శాఖా మంత్రి సీఆర్ పాటిల్‌తో పాటు ఆయా రాష్ట్రాల మంత్రులు, అధికారులు, పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం విజయనగర జిల్లా హోసపేటలో జరిగే భారీ బహిరంగ సభకు కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రులు వెళ్లారు. అంతకుముందు మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కొప్పల్ జిల్లా మునీరాబాద్‌లోని ఆడిటోరియంలో భేటీ అయ్యారు. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. తొలుత చంద్రబాబు, డీకే శివకుమార్ భేటీ అవ్వగా.. సమావేశానికి రేవంత్ రెడ్డి 15 నిమిషాలు ఆలస్యంగా వెళ్లారు. అనంతరం ముగ్గురు సీఎంలు, కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నీటి సమస్యలపై కీలక చర్చలు జరిపారు. ఆ తర్వాత అక్కడి నుంచి గేట్ల ప్రారంభోత్సవానికి వెళ్లారు.

# ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాలకు అంకురార్పణ

హైదరాబాద్,జూన్25: ఖైరతాబాద్ బడా గణెళిశుడి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు మొదలయ్యాయి. హైదరాబాద్ నగరంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహా గణపతి ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. నిర్జల ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్ గణెళిష్ ఉత్సవ కమిటీ, శ్రీ గణెళిష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గురువారం సాంప్రదాయబద్ధంగా కర్ర పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 69 అడుగుల భారీ విగ్రహం నమూనా పోస్టర్‌ను ఉత్సవ కమిటీ ఆవిష్కరించింది. ఈ ఏడాది 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా ఖైరతాబాద్ గణెళిశుడు దర్శనమివ్వనున్నాడు. విగ్రహానికి ఓ వైపు సోమనాథ్ జ్యోతిర్లింగం, మరోవైపు కాళీమాత విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి పండుగ జరగనుంది. ఈ ఏడాదితో ఖైరతాబాద్‌లో బడా గణెళిశుడి ఉత్సవాలు ప్రారంభమై 72 ఏళు పూర్తికానున్నాయి. ఈ పూజా కార్యక్రమం అనంతరం స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ ఈ ఏడాది కొలువుదీరనున్న వినాయకుడి నమూనా పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు. రాబోయే వినాయక చవితి పండుగ నాటికి, అంటే కేవలం 82 రోజుల్లోనే అన్ని హంగులతో కూడిన 70 అడుగుల భారీ మహా గణపతి విగ్రహాన్ని పూర్తి చేస్తామని ఉత్సవ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాలు సమసిపోయి, శాంతి చేకూరాలనే సంకల్పంతో ఈ సారి ఖైరతాబాద్ గణెళిశుడిని 'పంచముఖ సంకట హార మహా గణపతి' రూపంలో ఏర్పాటు చేస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఈ భారీ విగ్రహానికి కుడి వైపున ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన సోమనాథ్ జ్యోతిర్లింగం రూపాన్ని, ఎడమ వైపున భక్తులను రక్షించే కాళికామాత విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు. లోకకల్యాణార్థం కొలువుదీరనున్న ఈ పంచముఖ గణపతి విశేష రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది.

# జాతీయ సెలవు దినం కావడంతో ప్రజలంతా ఇంటివద్దే

**ప్రాణనష్టం భారీగా ఉండొచ్చంటున్న యూఎస్ జియలాజికల్ సర్వే**

**ప్రజలు ఇళ్లను వదిలి బయటకు రావాలని పిలుపు**

కారకాస్,జూన్25 వెనెజువెలా దేశాన్ని వరుసగా రెండు భూకంపాలు వణికించాయి. ఈ ప్రకృతి విపత్తు తీవ్రత ధాటికి దేశ రాజధానిలో తీవ్ర నష్టం వాటిల్లింది. పలు బహుళ అంతస్తు భవనాలు కూలిపోయాయి. శిథిలాల కింద ప్రజలు చిక్కుకుపోయి ఉండొచ్చని, దాంతో భారీ సంఖ్యలో ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ భూకంపాల తర్వాత బలమైన ప్రకంపనలు రావొచ్చు. దాంతో ఈ విపత్తు విధ్వంసకరంగా ఉండొచ్చు. భారీగా ప్రాణ, ఆస్తినష్టం సంభవించే అవకాశం ఉంది. మృతుల సంఖ్య 10వేల నుంచి లక్ష వరకు ఉండవచ్చని యూఎస్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. ప్రస్తుతానికి వెనెజువెలా ప్రభుత్వం మృతుల సంఖ్యపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. భూకంపాల ధాటికి గాయపడిన వారి సంఖ్య పెరుగుతూనే ఉందని స్థానిక అధికారులు, ప్రత్యక్ష సాక్షులు చెప్తున్నారు. ఇళ్లను వదిలి బయటకు వచ్చేయాలంటూ భూకంపాల ప్రభావిత ప్రాంతాల ప్రజలకు వెనెజువెలా ప్రభుత్వం సూచించింది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఇళ్లకున్న పెట్రోల్ సరఫరాను కట్ చేసినట్లు వెల్లడించింది. కొన్ని భవనాలు కూలిపోయాయని, మరింత నష్టం వాటిల్లకుండా ఈ చర్యలని పేర్కొంది. జూన్ 24.. వెనెజువెలాలో నేషనల్ హాలిడే. దాంతో మిగతా రోజులతో పోలిస్తే.. ఎక్కువమంది ఇళ్లలోనే ఉన్నారు. బుధవారం సాయంత్రం ఆరుగంటల సమయంలో తొలి భూకంపం వచ్చింది. దాంతో భూమి కంపించినప్పుడు భారీగా ప్రజలు బయటకు పరిగెత్తిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ప్రాణనష్ట తీవ్రత పెరగడానికి ఈ హాలిడే కూడా ఒక బలమైన కారణం కావొచ్చని అధికారులు చెప్తున్నారు. ఈ విపత్తులో భారీగా మరణాల సంఖ్య ఉండొచ్చని వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ కూడా తన సందేశంలో పేర్కొన్నారు. రెండు భారీ భూకంపాల తర్వాత 20 వరకు ప్రకంపనలు వచ్చాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో వెనెజువెలాలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భూకంపం ధాటికి మెక్వెషియా అంతర్జాతీయ విమానాశ్రయం దెబ్బతిన్న దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. దాంతో దానిని మూసివేశారు. పలు విమానాల రాకపోకలను నిలిపివేశారు.

# వెనిజువెలాను వణికించిన వరుస భూకంపాలు

ధాటికి భారీ బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. లా గౌరియా ప్రాంతం తీవ్రంగా ప్రభావానినికి గురైంది. అయితే ఆ భూకంపాల వల్ల 32 మంది మృతిచెందగా, 700 మంది గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు కూలాయని, వీలైనంత వరకు అందర్నీ రక్షిస్తున్నామని, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని, లా గౌరియా రాష్ట్రంలో పరిస్థితి భయానకంగా ఉందని అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమ దిశలో 168 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీబియన్ తీరంలోని మోరన్ ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. సుమారు 22 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు పేర్కొన్నారు. దాదాపు శతాబ్ద కాలం తర్వాత వెనిజువెలాలో భారీ భూకంపం సంభవించింది. మృతుల సంఖ్య లక్ష వరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. వెనెజువెలాను బుధవారం నాడు వరుస భూకంపాలు 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూకంపాలు సంభవించి తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కరేబియన్ తీరంలోని మోరోన్ పట్టణానికి పశ్చిమాన 21 కిలోమీటర్ల దూరంలో 7.2 తీవ్రతతో మొదటి భూకంపం వచ్చింది. అదే పట్టణానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో క్షణాల వ్యవధిలోనే 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 10 వేల నుంచి లక్ష మంది వరకూ ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేసింది. అలాగే వేల మంది ప్రజలు గాయపడి ఉండొచ్చని తెలిపింది. భూకంపాలతో అనేక భవనాలు నేలమట్టం కాగా, ప్రజలు భయంతో పరుగులు తీస్తున్న అనేక వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.

మొదటి భూకంపం వచ్చినప్పుడు ఒక్కసారిగా పెద్దపెద్ద భవనాలు కూలిపోవడం ప్రారంభమయ్యాయి. అనేక చిన్నచిన్న ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఏం జరుగుతుందో గ్రహించి, ప్రాణరక్షణ కోసం ప్రజలు పరిగెత్తే లోపే అంతకంటే ఎక్కువ తీవ్రతతో రెండో భూకంపం వచ్చింది. దీంతో భారీ విధ్వంసం జరిగింది. కొన్ని భారీ భవనాలు కూలిపోగా, మరికొన్ని బిల్డింగులు ఊగిపోయాయి. కొన్ని ఇళ్ల పైకప్పులు కూలిపోగా, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. దీంతో తమ ప్రాణాలను, కుటుంబ సభ్యులను కాపాడుకునేందుకు స్థానికులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. మరోవైపు వెనెజువెలాలోని సైమన్ బొలివర్ అంతర్జాతీయ విమానాశ్రయం పైకప్పు కూలిపోయింది. దీంతో విమానాశ్రయంలోని టెర్మినల్ మొత్తం దుమ్ముతో నిండిపోయింది. కొంతమంది ప్రయాణికులు తమ లగేజీ పట్టుకుని ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. మరికొంతమంది లోపలే ఓ ఫుడ్ కౌంటర్ వద్ద ఆశ్రయం పొందారు. మొత్తం దుమ్ముతో నిండిపోతున్నా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అక్కడే ఉండిపోయారు. తీరప్రాంత నగరమైన లా

గువైరాకు సంబంధించిన మరో వీడియో వెలుగులోకి వచ్చింది. వరుస భూకంపాలతో కూలిపోయిన భవనాలు, గాలిలోని దుమ్ము, నిర్మానుష్యంగా మారిన రహదారులు ఆ వీడియోలో కనిపించాయి.

వెనెజువెలా రాజధాని కారకాస్‌లోనూ భారీ విధ్వంసం జరిగింది. అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. స్థానికులు ప్రాణభయంతో కేకలు వేసిన దృశ్యాలు ఆవేదన కలిగిస్తున్నాయి. మరో వీడియోలో ఓ వ్యక్తి తన పెంపుడు కుక్కల ప్రాణాలు కాపాడిన దృశ్యాలు కనిపించాయి. కూలిపోయిన తమ ఇంటి నుంచి అతి కష్టం మీద కుటుంబ సభ్యులను కాపాడుకున్నాడు బాధితుడు. ఆ తర్వాత తన రెండు కుక్కలనూ ప్రాణాలతో బయటకు తీసుకువచ్చాడు. ఇలాంటి అనేక వీడియోలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను కంటతడి పెట్టిస్తున్నాయి. మరోవైపు జంట భూకంపాల అనంతరం వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. బాధితులను ఆదుకునేందుకు సహాయక చర్యలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాడో కూడా ప్రజలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు బీమా భరోసా

పిలిపించుకోవడమే తనకు ఇష్టమని చెప్పారు. పదవులు, హోదాలు మారొచ్చుగానీ ప్రజలతో తన అనుబంధం ఎప్పటికీ మారదని స్పష్టం చేశారు. అలాగే గత పాలనలో ఉద్యోగులకు ప్రతి నెల 10వ తేదీ వరకు కూడా జీతాలు అందని పరిస్థితి ఉండేదని విమర్శించారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరి 1 నుంచి ప్రతి నెల ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉద్యోగులు ప్రమాదంలో చనిపోతే కోటిన్నర బీమా ఇస్తామని ప్రకటించిన సీఎం.. ఆదిశగా ముందడుగు వేశారు. బ్యాంకులను ఒప్పించి బీమా ఎంఓయూపై సంతకం చేశారు. ఈ బీమాతో 15 లక్షల మంది రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. పెన్షనర్లు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు కూడా ఈ బీమా వర్తించనుంది. తొలుత సింగరేణి సంస్థలో ఈ బీమాను ప్రారంభించారు. ఇప్పటికే 45 మంది సింగరేణి కార్మికులు చనిపోతే కోటిన్నర బీమా చెల్లించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు కోటిన్నర బీమా అమలులో డిప్యూటీసీఎం భట్టి కృషి ఎంతో ఉందన్నారు. ఉద్యోగులంతా ప్రభుత్వంలో కుటుంబ సభ్యులు.. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తొలుత ఈ బీమా అమలుపై అనేక సందేహాలున్నా.. తర్వాత ఉద్యోగులకు సంక్షేమమే లక్ష్యంగా ఎంతో కసరత్తు చేశామన్నారు. బ్యాంకర్లను ఒప్పించి ఈ బీమాను కల్పించామన్నారు సీఎం. మరోవైపు విమాన ప్రమాదంలో చనిపోయిన ఉద్యోగులకు రూ.3కోట్ల బీమా కల్పిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఉద్యోగులు నడుం బిగించాలని సీఎం పిలుపునిచ్చారు. ఉద్యోగులంతా రోజుకు ఒక గంట అదనంగా పని చేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో కొందరు పన్నులు కట్టకుండా తప్పించుకుంటున్నారని, అలాంటి వారిని గుర్తించి పట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ట్యాక్స్ బకాయిలను కఠినంగా వసూలు చేయడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని గణనీయంగా పెంపొందించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. గత ప్రభుత్వ తీరుపై ముఖ్యమంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత పాలకులు అత్యధిక వడ్డీలకు అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి, గతంలో 11 శాతంగా ఉన్న వడ్డీ రేట్లను 7.5 శాతానికి తగ్గించగలిగామని వివరించారు. రాష్ట్రంలో తాము చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని సీఎం మండిపడ్డారు. 'మూసీ నది పునరుజ్జీవనం చేద్దామంటే నా కాళ్లలో కట్టెలు పెడుతున్నారు. రీజనల్ రింగ్ రోడ్డు చేపడితే తప్పా? మెట్రో విస్తరణ చేద్దామన్నా, ఆర్‌ఆర్‌ఆర్ తెస్తామన్నా వద్దే వద్దని అడ్డుపడుతున్నారు. తమకు ఓట్లు వేయని ప్రజలు ఉంటే ఏంది, పోతే ఏంది అనే రీతిలో బీఆర్‌ఎస్ నేతలు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు' అని రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తదితరులు పాల్గొన్నారు.

# పాస్‌పోర్టు ఫీజులు భారీగా పెంచిన కేంద్రం

ఈ ఫీజు రూ.1,500గా ఉండేది. ఇక తత్కాల్ పథకం కింద ఇదే పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారి ఫీజు రూ.3,500 నుంచి రూ.5 వేలకు పెరిగింది. 60 పేజీల పాస్‌పోర్టు ఫీజు కూడా రూ.2 వేల నుంచి రూ.3,500కు పెరిగింది. తత్కాల్ పథకం కింద ఈ పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకునే వారు ఇకపై రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఈ ఫీజు రూ.4 వేలుగా ఉండేది. పాస్‌పోర్టు పోగొట్టుకున్న సందర్భాల్లో కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) కోసం ఇకపై రూ.5 వేలు చెల్లించాలి. తత్కాల్ స్కీమ్‌లో బుక్ చేసుకుంటే రూ.7,500 చెల్లించాల్సి ఉంటుంది. 60 పేజీల పాస్‌పోర్టు విషయంలో ఈ ఫీజులు వరుసుగా రూ.6 వేలు, రూ.8,500 వేలకు పెరిగాయి. 18 ఏళ్ల పిల్లలకు కొత్త పాస్‌పోర్టు (36 పేజీలు) ఫీజు రూ.1,750గా నిర్ణయించింది. తత్కాల్ పథకం కింద ఈ పాస్‌పోర్టు కోసం ఇకపై రూ.4,250 చెల్లించాల్సి ఉంటుంది. మైనర్లు పాస్‌పోర్టు పోగొట్టుకున్న సందర్భాల్లో కొత్త పాస్‌పోర్టు కోసం రూ.4,250, తత్కాల్ స్కీమ్ కింద ఇదే పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకుంటే రూ.6,750 చెల్లించాల్సి ఉంటుంది. మేరకు విదేశాంగ శాఖ పాస్‌పోర్టు నిబంధనలకు మార్పులు చేసింది. 2012లో చివరిసారిగా కేంద్రం పాస్‌పోర్టు ఫీజులను సవరించింది. సాధారణ విధానంలో దరఖాస్తు చేసుకుంటే 45 రోజుల్లోపు పాస్‌పోర్టు జారీ అవుతుందన్న విషయం తెలిసిందే. తత్కాల్ విధానంలో ఇంతకంటే త్వరగా పాస్‌పోర్టు పొందే అవకాశం ఉంది.

## ఒకటో తేదీనే జీతాలు..

హైదరాబాద్,జూన్25 తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని క్యాబినెట్ ఉద్యోగుల సంక్షేమం కోసం దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సరికొత్త ఉచిత బీమా పథకాన్ని ఆమోదించిందని ఆయన వెల్లడించారు. ఈ పథకం ద్వారా అటు ప్రభుత్వంపై కానీ, ఇటు ఉద్యోగులపై కానీ ఒక్క రూపాయి కూడా అదనపు భారం పడకుండా, బ్యాంకులతో మాట్లాడి ఈ భారీ బీమా రక్షణను కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ అద్భుతమైన బీమా పథకం ద్వారా సాధారణ ప్రమాదాల్లో మరణిస్తే రూ. కోటి 25 లక్షలు, అదే విమాన ప్రమాదం జరిగితే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు బీమా పరిహారం అందుతుందని భట్టి విక్రమార్క వివరించారు. 18 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల ఉద్యోగులకు రూ. 10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఈ పథకం ద్వారా ఉద్యోగులకు ఆర్థిక అండ లభిస్తుందన్నారు. కేవలం రెగ్యులర్ ఉద్యోగులకే కాకుండా.. నెలనెలా ప్రభుత్వ రికార్డుల ద్వారా జీతం పొందే కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఇతర తాత్కాలిక ఉద్యోగులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. తమ కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా ఆపద వస్తే ఆ కుటుంబం రాత్రికి రాత్రే రోడ్డున పడే పరిస్థితి ఉండకూడదు. ఉద్యోగులు కేవలం జీతగాళ్లు కాదు, వారి కుటుంబాలకు ఈ ప్రభుత్వం ఒక పెద్ద దిక్కుగా ఉంటుందని నమ్మకం కలిగించడమే మా లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జీతాలు 15 లేదా 20వ తేదీ వరకు రాకపోవడం వల్ల ఉద్యోగులు పడిన ఇబ్బందులను భట్టి విక్రమార్క గుర్తుచేశారు. ప్రస్తుత కాలంలో ఇళు, వాహనాలు, పిల్లల చదువుల కోసం ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఇన్‌స్టాల్మెంట్స్ (ఈఎంఐలు) కడుతున్నారు. సకాలంలో జీతాలు రాకపోతే వారి అకౌంట్లు బ్యాడ్ అకౌంట్స్‌గా మారి సిబిల్ స్కోర్ దెబ్బతినేది. మా ప్రభుత్వం రాగానే ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉన్నప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి గారు 'ఉద్యోగుల హక్కులను కాపాడాలి' అని గట్టిగా నిర్ణయించుకుని, ఒకటో తేదీ నాడే జీతాలు ఇచ్చేలా కఠినమైన ప్రణాళికను అమలు చేశారని అన్నారు. రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఎ రేవంత్ రెడ ÷–డి, మంత్రులు పొన్నంప్రభాకర్, పొంగులేటి, అజారుద్దీన్, వివేక, సిఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు

క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు

జూన్ 28లోగా లొకేషన్ల ఖరారు జూలై మొదటి వారంలో బ్రోచర్ విడుదల

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్,జూన్25 పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు పక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు పక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన్ ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే మోడల్ లో ఆర్.డి.ఓ., తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. అలాగే, ఆర్.డి.ఓ. తహశీల్దార్ కార్యాలయాల భవనాల మరమ్మతులకు సంబంధించి హౌసింగ్ ఏ.ఈ. లు భవనాలను విజిట్ చేసి ప్రతిపధనలు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి, డి.ఎస్. లోకేశ్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్తాబాద్ నూతన మండల విద్యాధికారిగా పదవి బాధ్యతలు చేపట్టిన అంబటి రవీందర్



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /జూన్ -26(అక్షరం న్యూస్ )

ముస్తాబాద్ మండలానికి నూతన ఇంచార్జి ఎంఈఓ గా ముస్తాబాద్ జడ్పీ హెచ్ ఎస్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి రవీందర్ గురువారం స్థానిక ఎం అర్సీ కార్యాలయం లో పదవి బాధ్యతలు చేపట్టారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి విద్యార్థుల సంఖ్య పెంచడానికి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు, అందరి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు . ఈ సందర్భంగా ఎం ఆర్ సి సిబ్బంది తుమ్మ రాజేందర్, రమాదేవి, శ్రీకాంత్ రెడ్డి పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉపాధ్యాయులు సి ఆర్ పి లు అభినందనలు తెలిపారు.

### కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలి

## ఎన్‌టీపీసీ కార్మికుల భారీ ధర్నా కేంద్ర కార్మిక శాఖ అధికారికి వినతిపత్రం






జ్యోతినగర్, ఎన్ టిపిసి జూన్ 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్:

కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాల జీవోను తక్షణమే సవరించి నెలకు రూ.26 వేల కనీస వేతనంగా నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ. ముత్యంరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎన్‌టీపీసీ టీటీఎస్ గేట్ నుంచి ర్యాలీగా వెళ్లిన కాంట్రాక్టు కార్మికులు కేంద్ర సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం కేంద్ర సహాయ కార్మిక కమిషనర్ మహమ్మద్ యూసఫ్‌కు వినతిపత్రం అందజేసి, కేంద్ర ప్రధాన కార్మిక కమిషనర్‌కు పంపించాలని కోరారు. ఈ సందర్భంగా ముత్యంరావు మాట్లాడుతూ, సింగరేణి, ఎన్‌టీపీసీ, రామగుండం ఎరువుల కర్మాగారం, బసంత్‌నగర్ సిమెంట్ పరిశ్రమ, రైల్వేలు, చమురు సంస్థలు తదితర ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో పనిచేస్తున్న వేలాది మంది కాంట్రాక్టు కార్మికులకు అమలవుతున్న కనీస వేతనాల జీవోను సకాలంలో సవరించకపోవడం వల్ల తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు నిరంతరం పెరుగుతున్నప్పటికీ, కార్మికుల వేతనాలను పెంచడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కనీస వేతనాల చట్టం ప్రకారం ప్రతి ఐదేళ్లకోసారి పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాల్సి ఉండగా, 2017 జనవరి 19న జారీ చేసిన జీవో గడువు 2022 జనవరి 18తో ముగిసిందని గుర్తు చేశారు. గడువు ముగిసి నాలుగున్నరేళ్లు దాటినా ఇప్పటివరకు వేతనాలు సవరించకపోవడం వల్ల వేలాది మంది కార్మికులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యజమానుల లాభాలపై ఎలాంటి పరిమితులు విధించని ప్రభుత్వం, కార్మికుల భవిష్యనిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా, బోనస్‌లపై పరిమితులు విధించడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికుల హక్కులు, సంక్షేమ సౌకర్యాలు దెబ్బతింటాయని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే కనీస వేతనాల జీవోను సవరించి నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలని, భవిష్యనిధి, ఉద్యోగుల రాష్ట్ర బీమా, బోనస్‌లపై ఉన్న పరిమితులను తొలగించాలని, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు నష్టం కలిగించే కార్మిక కోడ్‌ల నిబంధనలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు, నాయకులు ఎన్. బిక్షపతి, గిట్ల లక్ష్మారెడ్డి, ఎం.డి. యాసిన్, సీహెచ్. ఉపేందర్, ఎం.డి. యాకూబ్, దండ రాఘవరెడ్డి, అక్కపాక శంకర్, బి. తిరుపతి, ఆడెపు రమేష్, సరళ, రాజు, కేతమ్మ, కనకలక్ష్మి, స్వరూపతో పాటు పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు

## ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు మంగళంపల్లి రామనారాయణ జన్మదిన వేడుకలు



జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 25:

ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మంగళంపల్లి రామనారాయణ 62వ జన్మదిన వేడుకలను గురువారం ఎన్టీపీసీ లో ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఆకుల రాంకిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రామనారాయణ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రామ్ కిషన్ సంఘం సభ్యులు ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘంలో చురుకుగా పనిచేస్తూ సేవలందిస్తున్న రామనారాయణను పలువురు అభినందించారు. భవిష్యత్తులో కూడా సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం మంగళంపల్లి రామనారాయణ మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలను నిర్వహించి సత్కరించిన సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగ జీవితంలో సహచరులతో గడిపిన అనుభవాలను గుర్తు చేసుకుంటూ, ప్రస్తుతం విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం వల్ల మళ్లీ ఉద్యోగ జీవితంలో ఉన్న అనుభూతి కలుగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు డాక్టర్ దుర్గం నరసయ్య, డాక్టర్ బండారి కనకయ్య, తిరుమల సురేందర్ గౌడ్, లాలయ్య, ఎన్. బాలకృష్ణ గౌడ్, ఎం.ఏ. ముఖిద్, సత్యనారాయణ కొమ్ము గోపాల్, సాంబమూర్తి తదితరులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## నేటి యువత దేశానికి వెన్నుముక






- గంజాయి బారినపడి బ్రతుకు నాశనం చేసుకోవద్దు.
- యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సులోఏసీపీ కిరణ్ కుమార్.

మంచిర్యాల జిల్లా/ మందమర్రి/ జూన్ 25/అక్షరం న్యూస్ -:

నేటి యువత దేశానికి వెన్నుముక వంటి వారని అలాంటి విద్యార్థులు గంజాయి డ్రగ్స్ వంటి వ్యసనాల బారిన పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం మందమర్రి పట్టణంలోని సింగరేణి కాలరీస్ ఎయిడెడ్ హైస్కూల్ (కళ్యాణిఖని) ప్రాంగణంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై 'ఈగల్ ఫోర్స్ తెలంగాణ' పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ మరియు మందమర్రి సీఐ పర్స రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో బెల్లంపల్లి ఏసీపీ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని కోరారు. విద్యార్థి దశలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి చదువు యొక్క ప్రాధాన్యతను గుర్తించాలని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. సరైన కెరీర్ ప్లానింగ్ ద్వారా జీవితంలో అనుకున్నది సాధించవచ్చని ఉద్బోధించారు. డ్రగ్స్ సరఫరా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా యాంటీ డ్రగ్ హెల్ప్‌లైన్ నంబర్ 1908 కు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయని తెలిపారు.

### డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ మరియు పోస్టర్ల ఆవిష్కరణ:

కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పోలీస్ సిబ్బందితో కలిసి అధికారులు 'మాదకద్రవ్యాలకు నో చెపుదాం - జీవితానికి ఎస్ చెపుదాం' (సే నో టు డ్రగ్స్ - సే ఎస్ టు లైఫ్) అంటూ చేతులు చాచి ఘనంగా ప్రతిజ్ఞ చేయించారు. అలాగే డ్రగ్స్ వల్ల మానవ శరీర భాగాలపై పడే దుష్ప్రభావాలను వివరించేలా రూపొందించిన పలు అవగాహన పోస్టర్లను అధికారులు, పాఠశాల యాజమాన్యం కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ గోపతి నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో మండలంలోని అన్ని స్కూల్(సింగరేణి, కార్మెల్, లిటిల్ ఫ్లవర్, శ్రీ చైతన్య, కృష్ణవేణి, మాంటిసోరి) విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి





జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 25 పెద్దపల్లి జిల్లా ఆఫీసులో న్యూస్:

ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అధికారులు సూచించారు. రామగుండం పట్టణ, గ్రామీణ మండలాల బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి పర్యవేక్షకులతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం--2026పై సమీక్ష సమావేశం గురువారం ఎన్టీపీసీ మిలీనియం హాల్‌లో నిర్వహించారు.

ఎన్నికల నమోదు అధికారి, స్థానిక సంస్థల సహాయ కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి, అదనపు కలెక్టర్ అరుణశ్రీ, డిప్యూటీ మేయర్ పతిపల్లి ఎల్లయ్య, రామగుండం తహసీల్దార్ రవీందర్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఓటరు జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు, వివరాల సవరణ వంటి ప్రక్రియలను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. ప్రతి అర్హుడైన పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలనలు చేపట్టాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల్లో ఓటరు నమోదు పట్ల అవగాహన పెంపొందించి, యువ ఓటర్లను నమోదు ప్రక్రియలో భాగస్వాములను చేయాలని సూచించారు.

సమావేశంలో బూత్ స్థాయి పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులు పాల్గొని క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. ఎన్నికల ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు అధికారులు అందించారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రెవెన్యూ శాఖ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ జోసెఫ్‌లో యాంటీ డ్రగ్ అవగాహన సదస్సు



మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనం అవుతాయి: డీసీపీ రాంరెడ్డి

జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్: మాదకద్రవ్యాల దుర్వినియోగం యువత భవిష్యత్తును చీకటిలోకి నెడుతుందని, వాటి వినియోగంతో జీవితాలు నాశనం అవుతాయని పెద్దపల్లి డీసీపీ రాంరెడ్డి పేర్కొన్నారు. జూన్ 26న నిర్వహించనున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని రామగుండం పట్టణంలోని విశ్వభారతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌కు చెందిన సెయింట్ జోసెఫ్ విద్యా సంస్థలో గురువారం యాంటీ డ్రగ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాంరెడ్డితో పాటు రామగుండం ఏసీపీ మడత రమేష్, సీఐ కృష్ణకుమార్, ఎస్సై సంధ్యారాణి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల గుండె, ఊపిరితిత్తులు, కాలేయం తదితర కీలక అవయవాలు తీవ్రంగా దెబ్బతింటాయని, అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వివరించారు. డ్రగ్స్ బారిన పడిన యువత వ్యసనానికి బానిసలై తమ భవిష్యత్తును తామే నాశనం చేసుకుంటున్నారని, ఇది తల్లిదండ్రులకు తీవ్ర ఆవేదన కలిగిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, లక్ష్యసాధన, ఆరోగ్యకరమైన అలవాట్లు ఎంతో ముఖ్యమని సూచించారు. అదేవిధంగా నేటి విద్యార్థులు మొబైల్ ఫోన్లను అధికంగా వినియోగించడం వల్ల చదువులకు దూరమై విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని తెలిపారు. డ్రగ్స్‌తో పాటు అనవసర మొబైల్ వినియోగానికి కూడా దూరంగా ఉండాలని సూచించారు. విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్, హెడ్మాస్టర్ తిరుపతి గౌడ్, నోయల్ జోసెఫ్, ఆశాలతతో పాటు అధ్యాపక బృందం పాల్గొని విద్యార్థులకు నైతిక విలువలు, ఆరోగ్యకర జీవన విధానంపై మార్గదర్శనం చేశారు. సెయింట్ జోసెఫ్ మరియు నవోదయ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

- పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: డా. పి. నాగిని



సూర్యాపేట /నేరేడుచర్ల, జూన్ 25 (అక్షరం న్యూస్ )

పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమం మరియు సీజనల్ వ్యాధుల నివారణపై నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డా. పి. నాగిని మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. అలాగే వర్షాకాలంలో ప్రబలే డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు వంటి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నిల్వ నీరు లేకుండా చూసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని వివరించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆమె కోరారు. మున్సిపల్ చైర్మన్ కొనతం. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమాన్ని మేము ఒ కౌన్సిలర్లు అందరూ బాధ్యతతో విజయవంతశీ చేయడానికి మా వంతు కృషి చేస్తామని తెలియజేశారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల పరిసరాల పరిశుభ్రత, మలేరియా డెంగ్యూ వంటి వ్యాధుల నివారణలో మున్సిపల్ సిబ్బందితో, వ్యాధుల నివారణకు కృషి చేస్తామని తెలియజేశారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ కమిషనర్, మండల స్థాయి అధికారులు, ఎంఈఓ, రెవెన్యూ, ఐసీడీఎస్ శాఖ సిబ్బంది, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు హాజరయ్యారు.



## గోదావరిఖనిలో లయన్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారం





జ్యోతి నగర్ ఎన్టిపిసి, జూన్ 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

: గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో లయనిస్టిక్ సంవత్సరం 2026--27కు సంబంధించి లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని లక్ష్మీనగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని, లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని వాసవి, లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి క్లబ్బుల నూతన కార్యవర్గాల ఇన్‌స్టాలేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని లక్ష్మీనగర్ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారులుగా లయన్ అనుగం కృష్ణమూర్తి, ఆవునూరి శంకర్, చొక్కారపు వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని అధ్యక్షుడు కార్యదర్శి కోశాధికారిగా చిట్టిమల్ల కిషోర్, అల్లాడి నాగరాజు, చింతకింది కృష్ణ, లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని వాసవి అధ్యక్షుడు కార్యదర్శి కోశాధికారి గా కొమురవెల్లి రాహుల్, ఇల్లెందుల శ్రీనివాస్, దొంతుల గంగాధర్ బాధ్యతలు చేపట్టారు. అలాగే ఇతర క్లబ్బుల నూతన కార్యవర్గాలు కూడా ప్రమాణ స్వీకారం చేశాయి. ముఖ్య అతిథి, ఇన్‌స్టాలేషన్ చైర్‌పర్సన్ లయన్ ఉడారి చంద్రమోహన్ నూతన కార్యవర్గాలతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందించారు. లయన్స్ క్లబ్‌లు సమాజ సేవలో ముందుండి విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సంక్షేమ రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గౌరవ అతిథులుగా లయన్స్ వొల్లాల హరికృష్ణ, కొల్లూరి ఆనందం, సాదుల వెంకటేశ్వర్లు, మాదరబోయిన భాస్కర్, నార్ల ప్రసాద్, సోమారపు లావణ్య, కొమురవెల్లి సుధాకర్, లక్ష్మీవాణి పాల్గొని నూతన కార్యవర్గాలను అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్ సభ్యులు బంక రామస్వామి, కాజంపురం రాజేందర్, రేణికుంట చందర్, కట్కూరి శ్రావణ్, గుంత వినోద్, కోదాటి ప్రవీణ్, షేగంటి నరేష్, రత్నాకర్, దొండపాటి మహేందర్ రెడ్డి తదితరులతో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని స్ఫూర్తి, వాసవి, జ్యోతినగర్ ప్రగతి, లక్ష్మీనగర్ క్లబ్బుల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, నూతన కార్యవర్గాలకు శుభాకాంక్షలు తెలియజేశారు.




### ఇంటి ముందుకు వచ్చే మున్సిపల్ వాహనానికి

## చెత్త అందించడంతోపాటు ప్రతి నెల 50 రూపాయలు ఇవ్వండి..





- మేయర్ మహంకాళి స్వామి

జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

ఇంటి ముందుకు వచ్చే మునిసిపల్ వాహనానికి చెత్త అందించడంతో పాటు ప్రతి నెలా యాభయ్ రూపాయలు వారికి చెల్లించి సహకరించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. వార్డు సందర్శనలో భాగంగా గురువారం డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , స్థానిక కార్పొరేటర్ చిదురాల నాగరాజు తో కలిసి 52 వ డివిజన్ కళ్యాణ్ నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో , కాలువల్లో చెత్త వేసిన వారికి రూ 500/- జరిమానా విధింపు ప్రక్రియ ప్రారంభిస్తున్నామని అన్నారు . జరిమానా బారిన పడకుండా నెలకు కేవలం రూ 50/- చెల్లిస్తే నెల రోజుల పాటు మునిసిపల్ పారిశుద్ధ్య సిబ్బంది చెత్త ఇంటి ముందుకు వచ్చి తీసుకువెళతారని అన్నారు. ప్రతి గృహస్తు తప్పకుండా రూ 50/- చెల్లించి సహకరించాలని అన్నారు. చెత్త మునిసిపల్ సిబ్బందికి ఇవ్వకుండా ఆరు బయట పడ వేసే వారి ఫోటో తీసి మున్సిపల్ సిబ్బందికి పంపిస్తే జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. తరచుగా ఇదే పునరావృతమైతే వారికి మునిసిపల్ సేవలు కూడా నిలిపివేస్తామని అన్నారు. కావున ఎం ఎల్ ఎ ఆశయాలకు అనుగుణంగా రామగుండంను స్వచ్ఛ నగరంగా తీర్చి దిద్దడానికి చెత్త మునిసిపల్ వాహనాలకు అందించి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కాలువల్లో పూడిక తొలగింపు పనులు , రోడ్ల మీదకు వచ్చిన చెట్ల కొమ్మలు తొలగించారు . మేయర్ ఆదేశాల మేరకు ఆర్ పి లు , అంగన్ వాడీ కార్యకర్తలు ఇంటింటా తిరుగుతూ చెత్త బయట వేయవద్దని గృహస్థులను కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ , టి పి ఎస్ నవీన్ , ఎ ఇ మనోజ్ , సానిటరి ఇన్స్పెక్టర్ సంపత్ , జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఉపసర్పంచులకు అధికారాలు కల్పించాలి

- మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు తాళ్ల రవీందర్..
- చలో హైదరాబాద్‌లో భీమదేవరపల్లి మండల ఉపసర్పంచుల..

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 25/అక్షరం న్యూస్:-

ఉపసర్పంచులకు చట్టబద్ధమైన అధికారాలు కల్పించి గ్రామ పంచాయతీల్లో వారి పాత్రను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లో నిర్వహించిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో భీమదేవరపల్లి మండల ఉపసర్పంచులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలు డిమాండ్లను తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సమావేశాలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఉపసర్పంచులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఉపసర్పంచులకు ప్రత్యేక గౌరవ వేతనం అందించడంతో పాటు గ్రామాభివృద్ధి పనుల్లో నిర్ణయాధికారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీలో ఉపసర్పంచులకు ప్రత్యేక ఛాంబర్ ఏర్పాటు చేయాలని చెక్ పవర్ తొలగిస్తారనే ప్రచారంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. భీమదేవరపల్లి మండల ఉపసర్పంచ్ ఫోరం అధ్యక్షుడు తల్లా అరవింద్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం సేవలందిస్తున్న ఉపసర్పంచుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపసర్పంచులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉపసర్పంచుల హక్కులు, గౌరవం, అధికారాల సాధన కోసం తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. హనుమకొండ జిల్లా ఉపసర్పంచ్ ఫోరం ప్రధాన కార్యదర్శి మిర్యాల రాణి రాజు మాట్లాడుతూ ఉపసర్పంచుల హక్కుల సాధన కోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజాప్రతినిధులు ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో భీమదేవరపల్లి మండలానికి చెందిన పలువురు ఉపసర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.



## పెంచిన ఆటో చార్జీలకు ప్రజలంతా సహకరించాలి

- ఈ నెల 26 నుండి లోకల్ ఆటో చార్జీలు 30 రూపాయలు...



సూర్యాపేట టౌన్ జూన్ 25(అక్షరం న్యూస్ )

పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగిన నేపథ్యంలో తప్పని పరిస్థితుల్లో ఆటో చార్జీలు పెంచడం జరుగుతుందని ప్రజలంతా సహకరించాలని సూర్యాపేట పట్టణ ఆటో జేఏసీ బి ఆర్ టి యు, ఐ ఎన్ టి సి నాయకులు తెలిపారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో లోకల్ ఆటోలు బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు పాల్గొని మాట్లాడుతూ 2019 నుండి 20 రూపాయలు చార్జి తీసుకోవటం జరిగిందని, అప్పటినుండి ఇప్పటివరకు పెట్రోల్ డీజిల్ ధరలతోపాటు ఆటో స్పేర్ పార్ట్స్, ఇంజన్ ఆయిల్, మెకానికల్ చార్జీలు, టైర్ పంచర్ రేట్లు పెరగడంతో ఆర్థిక భారం అవుతున్నందున తప్పనిసరి పరిస్థితిలో గతంలో ఉన్న 20 రూపాయలకు కేవలం పది రూపాయలు మాత్రమే పెంచి 30 రూపాయలు చేయడం జరిగిందని తెలిపారు.ఈనెల 26 శుక్రవారం నుండి ఆటో చార్జీలు అమలులోకు వస్తున్నందున ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆటో కార్మికులు పాల్గొన్నారు.

## కొప్పూరులో వివోఏల నూతన భవనానికి భూమిపూజ



హనుమకొండ జిల్లాభీమదేవరపల్లి/జూన్ 25/అక్షరం న్యూస్:-

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామంలో వివోఏల (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు) నూతన భవన నిర్మాణానికి గురువారం స్థానిక సర్పంచ్ గద్ద కుమారస్వామి భూమిపూజ నిర్వహించారు. ఉప సర్పంచ్ మిర్యాల రాణి రాజు, ఏపీఎం వేణు, పంచాయతీరాజ్ ఏఈ వినయ్ రెడ్డి తదితరులు పాల్గొని నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గద్ద కుమారస్వామి మాట్లాడుతూ వివోఏలకు ప్రత్యేక భవనం నిర్మాణం కావడం గ్రామ అభివృద్ధికి దోహదపడే శుభపరిణామమని అన్నారు. ఇప్పటి వరకు సమావేశాలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు సరైన వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నూతన భవనం అందుబాటులోకి వస్తే నెలవారీ సమావేశాలు మహిళా సంఘాల కార్యకలాపాలు గ్రూపుల శిక్షణ కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా నిర్వహించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.ఏపీఎం వేణు మాట్లాడుతూ మహిళా సంఘాలు గ్రామ సంస్థల నిర్వహణలో ఈ భవనం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో వివోఏల సేవలు ఎంతో ముఖ్యమని వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రత్నకుమారి, వార్డు సభ్యులు గడిపే కొమురయ్య, సంగేం శ్రీనివాస్, కొమ్ముల పద్మ, బాకీ అయిలమ్మ, గుడికందుల సప్న, సీసీ సదానందం, సీసీ అశోక్, సీసీ పద్మ, సీఏ స్వరూప, గడిపే కిరణ్ బేబి, మాజీ ఎంపీటీసీ గడిపే బిక్షపతి, అంబాల చక్రపాణి, కొమ్ముల నాగేష్, గడిపే మొగిలి, సుంచు రవీందర్, కొమ్ముల బాబు తదితర ప్రజాప్రతినిధులు, వివోఏలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


## పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు అండగా రేవంత్ సర్కార్...

- స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



జనగామ జిల్లా/ రఘునాథపల్లి /(అక్షరం న్యూస్) జూన్ 25:

పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని, కళ్యాణలక్ష్మి పథకం అడపడచుల పాలిట వరమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో 47 మంది కళ్యాణలక్ష్మి లబ్దిదార లకు రూ.47.05 లక్షల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం పంపిణీ చేశారు. అలాగే 24 మందికి రూ.8.32 లక్షల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందని అన్నారు. రఘునాథపల్లి విద్యుత్తు సబ్-స్టేషను లో- వోల్టేజి సమస్య తీర్చుడానికి రూ100 కోట్లతో 220 కేవీ సబ్ స్టేషన్ గా అప్గ్రేడ్ చేసేంద కు త్వరలోనే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అవినీతి అక్రమాలు లేకుండా అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు జరుగుతాయని అని అన్నారు, నియోజవర్గంలో ఎలాంటి అవినీతి అక్రమాలు లేకుండా ప్రజలకు సుపరిపాలన అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కడియం వివరించారు. కార్యక్రమంలో మారజోడు రాంబాబు, లింగాల జగదీష్ చందర్ రెడ్డి, తహసీల్దార్ రాజేష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్ తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు,నాయకులు పాల్గొన్నారు.



## మత్తు పదార్థాల బారినపడిన బాధితులను పరామర్శించిన డీసీపీ... డీ-అడిక్షన్ సెంటర్‌లో ఆటవస్తువుల పంపిణీ





జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 25 పెద్దపల్లి జిల్లా అక్షర నియోజకవర్గం

గంజాయి,ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన బాధితులను తిరిగి సాధారణ జీవన విధానంలోకి తీసుకురావడం,వారి మానసిక స్థితి, ప్రవర్తనలో సానుకూల మార్పులు తీసుకురావడం లక్ష్యంగా గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్‌ను పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డితో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితి,వారికి అందుతున్న వైద్య సేవలు,చికిత్స పురోగతి గురించి వైద్యులు,సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.గంజాయి,ఇతర మత్తు పదార్థాల వ్యసనానికి గురైన వ్యక్తులు తిరిగి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేలా అవసరమైన వైద్య, మానసిక,సామాజిక సహాయాన్ని అందించేందుకు పోలీసులు,వైద్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.చికిత్స పొందుతున్న బాధితుల కాలక్షేపం, మానసిక ఉల్లాసం, ఆలోచనా విధానంలో సానుకూల మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో అందించిన క్యారమ్ బోర్డులు,చెస్ బోర్డులు తదితర ఆటవస్తువులను డీసీపీ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, గంజాయి,ఇతర మత్తు పదార్థాల వ్యసనం నుంచి పూర్తిగా బయటపడేందుకు వైద్య చికిత్సతో పాటు మానసిక ప్రోత్సాహం, కుటుంబ సభ్యుల సహకారం,సమాజం నుంచి నిరంతర మద్దతు కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. వ్యసనానికి గురైన వారిని చిన్నచూపు చూడకుండా,వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.

## గబ్బెట గ్రామాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాది..





- పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం
- స్టేషన్ ఘనాపూర్ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ జిల్లా/రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూన్ 25: నియోజకవర్గ సంపూర్ణ అభివృద్దే అంకిత భావంతో పని చేస్తూ రాష్ట్ర స్థాయిలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నానని స్టేషన్ ఘనాపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిఅన్నారు.మండలంలోని గబ్బెటలో ఇంటి నిర్మాణం పూర్తయిననాలుగుఇందిరమ్మ ఇళ్లగృహప్రవేశకార్యక్రమాలతో పాటురూ.20 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం. గ్రామంలో



వివిధ కాలనీలలో రూ.45 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కూటికంటి ఉపేంద్ర అనిల్ అద్య క్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను రాజకీయాలకతీతంగా బాధ్యత నాదని, గ్రామంలో ఇళ్లు లేని వారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న పెద్దలు దోచుకోవడమే తప్ప ప్రజలకు చేసింది ఏమి లేదని, దళిత బంధు పథకాన్ని అమ్ముకోని, పదిహేను ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఏంచేశాడో ఒకసారి అలోచించాలని అన్నారు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన రెండున్నర ఏళ్లలో గబ్బెటలో రూ.1.50 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని, వచ్చే ఏడాదిలోపు గ్రామాభివృద్ధికి మరో కోటి రూపాయలు మంజూరు చేస్తానని అన్నారు. పేద ప్రజల సొంత ఇంటి కలను సీఎం రేవంత్ రెడ్డి సాకారం చేశారని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం. ఉచిత విద్యుత్తు, సన్న బియ్యం పంపిణీ, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, సన్న వడ్లకు బోనస్ వంటి అనేక సంక్షేమ ప థకాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయని వెల్లడించారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమానికి కృషి చేసు న్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఎల్లవేళాల



ఉండాలని కోరారు. కోమటిగూడెం రోడ్డుకు నిధులు, ముదిరాజ్ కవ న్యూనిటీ హాల్ పూర్తి చేయడానికి, నెల లోపు మరో రూ.25 లక్షల సీసీ రోడ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులైన వారి ఇంటికి సంక్షేమ ఫలాలు చేర్చే బాధ్యత నాదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి, లింగాజీ, కోళ్ల రవి, గాదె మహేందర్ రెడ్డి, వడ్లకొండ శివప్రసాద్, లోనే శ్రావణ్ కుమార్,రంగోజు ఈశ్వరయ్య, లోనె రవిందర్, పర్శ సిద్దేశ్ తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## విషాదంలోనూ మహాదానం..!

- నేత్రదానంతో ఇద్దరికి వెలుగులు



జ్యోతి నగర్ ఎన్టిపిసి జూన్ 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

గోదావరిఖని దుర్గానగర్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ మంతెన రాజయ్య సతీమణి, జనసేన పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి మంతెన సంపత్ తల్లి మంతెన వెంకటలక్ష్మి (68) గుండెపోటుతో గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. కుటుంబం తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ ఆమె నేత్రాలను దానం చేసి మానవతా దృక్పథాన్ని చాటింది.సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్. వాసు, స్ఫూర్తి లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి విజేందర్ సంయుక్త ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ సహకారంతో మృతురాలి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం కలిగిందని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా నేత్రదాత వెంకటలక్ష్మికి ఘనంగా నివాళులర్పించారు. విషాద సమయంలోనూ నేత్రదానానికి అంగీకరించి సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన భర్త మంతెన రాజయ్య, కుమారుడు--కోడలు మంతెన సంపత్, వరలక్ష్మి, కుమార్తెలు సొప్పదండి శ్వేత--దుర్గాప్రసాద్, పట్నాల సుప్రజ--జగదీష్ కుమార్‌లను సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్ కుమార్, కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు సానా రామకృష్ణారెడ్డి, నూక రమేష్, మారెల్లి రాజిరెడ్డి, లగిశెట్టి చంద్రమౌళి, భీష్మాచారి, కే.ఎస్. వాసు, వెల్ది కవిత అనంతరాములు, శశికళ, తాడబోయిన రాములు, దేవి లక్ష్మీనర్సయ్య, అలాగే స్ఫూర్తి లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎల్లప్ప, సారయ్య, రాజేంద్ర కుమార్, ముద్దసాని ప్రమోద్ కుమార్ రెడ్డి, పి. మల్లికార్జున్, కజాంపురం రాజేందర్, కోదాటి ప్రవీణ్ కుమార్ తదితరులు అభినందించారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి ప్రజలు సహకరించాలి

- మండల తహశీల్దార్ రాజేష్..



హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 25/అక్షరం న్యూస్:-

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైనట్లు భీమదేవరపల్లి మండల తహసీల్దార్ రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎమ్యునరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రతి ఇంట్లో ఉన్న ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఫారాలు అందజేస్తారని పేర్కొన్నారు.ఓటర్లు ఫారాలను పూర్తిగా ఎలాంటి తప్పులు లేకుండా నింపి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు. 2002 నాటి ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు ఆ వివరాలను నమోదు చేయాలని పేరు లేకపోతే తల్లిదండ్రులు, తాతలు, అమ్మమ్మలు లేదా నాయనమ్మల ఓటరు వివరాలను పొందుపరచాలని తెలిపారు.ప్రతి ఓటరు తాజా పాస్‌పోర్ట్ సైజు ఫోటోను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఇప్పటికే ఎస్ఐఆర్‌లో మ్యాపింగ్ పూర్తయిన ఓటర్లు కూడా తప్పనిసరిగా ఎమ్యునరేషన్ ఫారం నింపి సమర్పించాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేసేందుకు మండలంలోని ప్రజలందరూ సహకరించాలని తహశీల్దార్ కోరారు.

## గుండాల అంగడి సంతను సందర్శించి స్వయంగా

# కూరగాయలు కొనుగోలు చేసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య





యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 25 / : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని అంగడి సంతను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో కలిసి సంతలో తిరుగుతూ వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు కూరగాయల మార్కెట్ ప్రాంతంలో తగినంత వెలుతురు లేకపోవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన బీర్ల అయిలయ్య మార్కెట్‌లో అవసరమైన వీధి లైట్లు (స్ట్రీట్ లైట్లు) ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

అనంతరం ఆయన స్వయంగా అంగడి సంతలో కూరగాయలు కొనుగోలు చేసి సాధారణ ప్రజలతో మమేకమయ్యారు. సంతలో ఉన్న వ్యాపారులు, మహిళలు, రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. తర్వాత ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలతో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం సక్రమంగా అందుతున్నదా లేదా అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. పథకం అమలుపై మహిళల అభిప్రాయాలను స్వయంగా విని, సేవల నాణ్యతపై వివరాలు సేకరించారు.

ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. స్థానికులు కూడా ఆయన సంత సందర్శనపై హర్షం వ్యక్తం చేశారు.

## పెద్దమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గొంగిడి సునీత



యాదాద్రి భువనగిరి జిల్లా/ అక్షరం న్యూస్/ యాదగిరిగుట్ట / జూన్ 25 / : గురువారం రోజు బొమ్మల రామారం మండలం, పక్కిర్ గూడెం గ్రామ మాజీ సర్పంచ్ గణేష్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఇటీవల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి గొంగిడి సునిత మహేందర్ రెడ్డి , మాజీ జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి , బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్ర రెడ్డి మరియు మండల నాయకులు, గ్రామ సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు...

## ఫుట్‌పాత్ వ్యాపారులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గొడుగుల పంపిణీ




భద్రాద్రి కొత్తగూడెం/అశ్వరావుపేట / జూన్ 25 / అక్షరం న్యూస్ –: లయన్స్ క్లబ్ అశ్వరావుపేట ఆధ్వర్యంలో గురువారం ఫుట్‌పాత్ వ్యాపారులకు గొడుగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వీధులు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారులకు అండగా నిలిచే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు అశ్వరావుపేట పట్టణంలోని పలు పాంతాల్లో పర్యటించి ఫుట్‌పాత్‌లపై, రోడ్ల పక్కన వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారుల వద్దకే వెళ్లి స్వయంగా గొడుగులను అందజేశారు. వర్షాల కారణంగా వ్యాపార కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు ఈ గొడుగులు ఉపయోగపడతాయని తెలిపారు. రోజువారీ ఆదాయంపైనే ఆధారపడే చిన్న వ్యాపారులకు చేయూత అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.గొడుగులు అందుకున్న వ్యాపారులు లయన్స్ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ అవసరాన్ని గుర్తించి సహాయం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సమాజంలోని వివిధ వర్గాలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్‌ను అభినందించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అశ్వరావుపేట అధ్యక్షుడు లక్కినేని నరేంద్రబాబు, బలమురి సూర్యారావు, కోటగిరి మోహన్‌రావు, చలపతిరావు, డి. దుర్గారావు, కంచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను మరింత ముమ్మరంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

## పల్స్ పోలియోపై అవగాహన సమావేశం

హనుమకొండ జిల్లా/భీమదేవరపల్లి/జూన్ 28/అక్షరం న్యూస్:–

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామస్థులకు వైద్య సిబ్బంది పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం వంగర గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్, ప్రారంభించగా ఎస్ఐ దివ్య పాల్గొని పల్స్ పోలియో ప్రాధాన్యతను వివరించారు.అనంతరం రెండు చుక్కలు–నిండు ప్రాణాలకు అనే నినాదంతో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రహ్మాన్, సూపర్వైజర్ మోహన్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ సమీపంలోని పోలియో బూత్ కేంద్రాల్లో తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్టు అశోక్ వివాహ వేడుకలో పాల్గొన్న నిరుడు సర్వేష్ ముదిరాజ్

- **నూతన వధూవరులను ఆశీర్వదించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకుడు నిరుడు సర్వేశ్ ముదిరాజ్.**
- **ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగిన అశోక్ వివాహ మహోత్సవం.**



రంగారెడ్డి జిల్లా :శంకర్‌పల్లి: జూన్ 25 (అక్షరం న్యూస్ ):

శంకరపల్లి లో సీనియర్ జర్నలిస్టు అశోక్ వివాహ వేడుక గురువారం శంకర్‌పల్లిలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పాత్రికేయులు మరియు రాజకీయ నాయకుల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి తెలంగాణ రక్షణ సేన పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకుడు నిరుడు సర్వేష్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుక ఆత్మీయ వాతావరణంలో ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడింది. వివాహ కార్యక్రమంలో పాల్గొన్న నిరుడు సర్వేష్ ముదిరాజ్ మాట్లాడుతూ, వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల జీవితాలను కలిపే పవిత్ర బంధమని పేర్కొన్నారు.నూతన దంపతులు జీవితాంతం సుఖశాంతులతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.సమాజంలో కుటుంబ విలువలు, పరస్పర గౌరవం మరియు ప్రేమాభిమానాలు మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా వివాహ వేదికకు వచ్చిన అతిథులు వధూవరులను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన వివాహ కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. బంధుమిత్రులు, సహచరులు మరియు ఆహ్వానితులు నూతన దంపతులతో కలిసి ఆనందాన్ని పంచుకుంటూ వేడుకను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు సురేష్, ముకుందం తదితరులు పాల్గొన్నారు.వివాహ వేడుక విజయవంతంగా ముగియగా, హాజరైన వారందరూ నూతన దంపతులకు ఆశీస్సులు అందజేసి వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండిపోవాలని కోరుకున్నారు.

## వెల్ది మోడల్ స్కూల్‌లో పీజీటీ ఇంగ్లీష్(హెచ్.బి.టి) ఉపాధ్యాయ నియామక దరఖాస్తుల ఆహ్వానం



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్ )జూన్ 25 :

మండలంలోనివెల్ది మోడల్ స్కూల్‌లో 9వ తరగతి నుండి 12వ తరగతి విద్యార్థులకు బోధించడానికి తాత్కాలిక (గంటల) ప్రాతిపదికన పీజీటీ ఇంగ్లీష్ ఉపాధ్యాయుల కొరకు దరఖాస్తులు కోరుతున్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఇంగ్లీష్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ తో పాటు బి.ఇడి పూర్తి చేసి ఉండాలి. అనుభవం కలిగిన స్థానిక అభ్యర్థులకి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ తెలియజేశారు. ఆసక్తి మరియు అర్హత గల అభ్యర్థులకు జూన్ 29, 2026 న పాఠశాల ప్రాంగణంలో డెమో మరియు ఇంటర్వ్యూ నిర్వహించబడుతుంది. పూర్తి వివరాల కోసం తనని సంప్రదించాలని ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలియజేశారు.

## నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని ఢీకొట్టిన ట్రాలీ ఆటో, యువకుడి మృతి



చొప్పదండి / కరీంనగర్, జూన్ 25 (అక్షరం న్యూస్ )

నడుచుకుంటూ వెళు న్న యువకుడిని ట్రాలీ ఆటో ఢీకొట్టడముతో యువకుడి మృతి చెందాడని చొప్పదండి పోలీసులు తెలిపారు. చొప్పదండి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం చొప్పదండి మండలం, ఆర్నకుండ గ్రామానికి చెందిన గుంట మహేష్ తండ్రి పేరు బీరయ్య ,వయస్సు 25సంవత్సరాలు, డిగ్రీ పూర్తి చేసి హమాలీగా పని చేసుకుంటున్నాడు, నిన్న చొప్పదండలో అమరగుండ సురేష్ యొక్క కుమార్తె వివాహం జరిగినది. అట్టి పెళ్లి భరత్ కు మహేష్ ఇంటి నుండి 9 గంటలకు వెళ్ళినాడు. పెళ్లి భరత్ ముగించుకొని తిరిగి ఇంటికి నడుచుకుంటూ వచ్చే క్రమంలో బుధవారం రాత్రి అనగా తేదీ 24/06/2026 రోజున రాత్రి11:30 గంటల సమయం లో చొప్పదండి నుండి ధర్మారం వైపు వెళ్తున్నటువంటి ట్రాలీ ఆటో (టీఎస్ 17 ა 4056) మర్లవాడ వద్ద నడుచుకుంటూ వెళ్తున్నటువంటి మహేష్ ను వెనుక నుండి ఢీ కొట్టడంతోవెంటనే మహేష్ ను మొదటగా ప్రభుత్వ ఆసుపత్రికి 108 అంబులెన్స్ లో తరలించడం జరిగింది. తర్వాత మెరుగైన చికిత్స గురించి అపోలో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించడం జరిగింది. ఇట్టి విషయంపై తన తండ్రి భీరయ్య ఫిర్యాదు మేరకు డ్రైవర్ గుమ్మడి తిరుపతి పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసుల్ వశ్రీఅంం

## వెల్ది మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో జూన్ 29 న స్పాట్ అడ్మిషన్లు



జనగామ జిల్లా/ రఘునాథపల్లి/( అక్షరం న్యూస్) జూన్ 25:

మండలంలోని వెల్ది మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మిగిలి ఉన్న కొద్ది సీట్ల భర్తీ కోసం ఈ నెల 29న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ తెలిపారు. అర్హులైన విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అదేవిధంగా, పాఠశాలకు అనుబంధంగా ఉన్న బాలికల వసతి గృహంలో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికల కోసం కూడా కొద్ది సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు వెంటనే సంప్రదించి ప్రవేశాలు పొందాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో మోడల్ స్కూళ్లలో కొత్తగా ఏసీఈ (ూజజు ) గ్రూపును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రఘునాథపల్లి మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నాణ్యమైన విద్యను అభ్యసించాలని ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ విజ్ఞప్తి చేశారు.

# పర్యావరణానికి ఎంతో మేలు చేసే ప్లానెటరీ హెల్త్ డైట్.. అసలేంటిది.. దీన్ని ఎలా పాటించాలి..?

ఈట్-లాన్సెట్ డైట్ లేదా ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా భూమి సహజ వనరులను రక్షించేందుకు రూపొందించిన శాస్త్రీయ ఆహార విధానం. 2019లో 16 దేశాలకు చెందిన 37 మంది నిపుణులు కలిసి ఈ డైట్‌ను రూపొందించారు. 2050 నాటికి 10 బిలియన్ జనాభాకు ఆహారం అందించడంలో పర్యావరణానికి నష్టం కలగకుండా ఉండటం దీని ప్రధాన లక్ష్యం. ఈ డైట్ కఠినమైన నియమాలపై ఆధారపడినది కాదు. వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా మార్చుకునే విధంగా ఉంటుంది. ఇందులో కూరగాయలు, పండ్లు, సంపూర్ణ ధాన్యాలు, పప్పులు, గింజలు ప్రధాన భాగంగా ఉంటాయి. అలాగే పాలు, గుడ్లు, మాంసం వంటి వాటిని చాలా పరిమితంగా మాత్రమే తీసుకోవాలని ఈ డైట్ సూచిస్తుంది. సాధారణంగా పురుషులకు రోజుకు సుమారు 2,500 కేలరీలు, మహిళలకు 2,000 కేలరీలు సూచిస్తారు. ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ప్రపంచవ్యాప్తంగా అనుసరించదగిన రిఫరెన్స్ డైట్‌గా పరిగణించబడుతుంది. ఇది భిన్న ప్రాంతాలు, సంస్కృతులకు అనుగుణంగా మార్పులు చేసుకునే అవకాశం ఇస్తుంది. ముఖ్యంగా మొక్కల ఆధారిత ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలని, జంతు ఆధారిత ఆహారాన్ని తగ్గించాలని సూచిస్తుంది.

### ఏయే ఆహారం ఎంత తీసుకోవాలి..

ఈ డైట్‌లో ఆహారం ఎంత మోతాదులో తీసుకోవాలో కూడా సూచించబడుతుంది. రోజుకు కనీసం 300 గ్రాముల కూరగాయలు, 200 గ్రాముల పండ్లు తీసుకోవాలి. సంపూర్ణ ధాన్యాలు సుమారు 232 గ్రాములు తీసుకోవడం ద్వారా శరీరానికి స్థిరమైన శక్తి లభిస్తుంది. అలాగే పప్పులు 75 గ్రాములు, గింజలు 50 గ్రాములు, ఆరోగ్యకరమైన నూనెలు 40 గ్రాములు తీసుకోవాలి.



పాలు, గుడ్లు, చేపలు, చికెన్ వంటి ప్రోటీన్ ఆహారాలను మాత్రం పరిమితంగా తీసుకోవాలి. రోజుకు 250 గ్రాముల పాలు, గుడ్లు ఒకరోజు విడిచి ఒకటి, చేపలు లేదా చికెన్ 29 గ్రాములు మాత్రమే తీసుకోవాలని సూచిస్తున్నారు. ఎర్ర మాంసం (రెడ్ మీట్) కేవలం 14 గ్రాములకే పరిమితం చేయాలి. అదనపు చక్కెర 31 గ్రాములకు మించకూడదు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ భూమి, నీటి వనరులను భారీగా వినియోగిస్తూ, గ్రీన్ హౌస్ వాయువులను అధికంగా విడుదల చేస్తున్నారు. ఈ డైట్‌ను అనుసరించడం ద్వారా పర్యావరణంపై పడే ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో ఎర్ర మాంసం వినియోగం 80-90% వరకు తగ్గించాల్సిన అవసరం ఉంది.

### అనేక లాభాలు..

ప్లానెటరీ హెల్త్ డైట్ అనుసరించడం వల్ల ఆరోగ్యపరమైన అనేక లాభాలు ఉన్నాయని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు అధికంగా ఉండటం వల్ల శరీరంలో వాపు, ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. వ్యాధుల బారిన పడే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి.

హార్వర్డ్ పరిశోధన ప్రకారం, ఈ డైట్‌ను క్రమంగా పాటించడం వల్ల ముందస్తు మరణ ప్రమాదం సుమారు 30% వరకు తగ్గుతుంది. గుండె వ్యాధులు, క్యాన్సర్, స్ట్రోక్, డయాబెటిస్ వంటి వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుంది. ప్రపంచవ్యాప్తంగా సంవత్సరానికి 11 మిలియన్ మరణాలను నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు. ఈ డైట్ గుండె, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలోనూ సహాయపడుతుంది. మొక్కల ఆధారిత ఆహారాలు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. అలాగే మెదడు పనితీరును కాపాడి మతిమరుపు సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో కూడా ఈ డైట్ ఉపయోగకరంగా ఉంటుంది. ఫైటోకెమికల్స్, విటమిన్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి రక్షణ లభిస్తుంది. ప్రాసెస్డ్ ఫుడ్స్, రెడ్ మీట్ తగ్గించడం ద్వారా క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది

### పర్యావరణ పరిరక్షణ కూడా..

పర్యావరణ పరిరక్షణలో కూడా ఈ డైట్ కీలక పాత్ర పోషిస్తుంది. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాలను 29% వరకు తగ్గించడమే కాకుండా, ఎరువుల వినియోగాన్ని 21% వరకు తగ్గిస్తుంది. వ్యవసాయ భూమి అవసరాన్ని కూడా 51% వరకు తగ్గించే సామర్థ్యం ఉంది. ప్లానెటరీ హెల్త్ డైట్ అనేది ఆరోగ్యానికి, పర్యావరణానికి సమతుల్యమైన పరిష్కారం. సరైన ఆహార ఎంపికల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా భూమిని కూడా రక్షించవచ్చు. అయితే ఈ డైట్‌ను అనుసరించే ముందు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా వైద్యుల సలహా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# తరచూ నెలసరి నొప్పులు వస్తున్నాయా..? మహిళలు దీన్ని అసలు నిర్లక్ష్యం చేయకూడదు..!

మహిళలు నెలసరి నొప్పులను సాధారణంగా భావిస్తారు. చాలా మంది మహిళలు వీటిని అసలు పట్టించుకోరు. అయితే ఈ నొప్పి తీవ్రంగా మారి రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంటే, దాన్ని సాధారణంగా తీసుకోవద్దని వైద్యులు సూచిస్తున్నారు. ఇలాంటి తీవ్రమైన నొప్పులు సెకండరీ డిస్మెనోరియా అనే తీవ్రమైన సమస్యకు సంకేతం కావొచ్చని వారుహెచ్చరిస్తున్నారు. తీవ్రమైన లక్షణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని ప్రతి నెల మందులపై ఆధారపడటం, స్కూల్ లేదా పనికి వెళ్లలేకపోవడం వంటి పరిస్థితులు ప్రమాద సూచికలుగా భావించాలని వైద్యులు చెబుతున్నారు. అలాగే నొప్పి కాలక్రమేణా నొప్పి తీవ్రత పెరగడం లేదా పీరియడ్ సమయంలో కాకుండా ఇతర సమయాల్లో కూడా నొప్పి ఉండడం వంటి వాటిని తేలికగా తీసుకోకూడదని ఈ లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు.

### రెండు రకాలుగా ఉంటాయి..

నెలసరి నొప్పులను సాధారణంగా రెండు రకాలుగా విభజిస్తారు. మొదటిది ప్రైమరీ డిస్మెనోరియా. ఇది సాధారణంగా ఏదైనా ప్రత్యేక కారణం లేకుండా వస్తుంది. ఇది ప్రోస్టాగ్లాండిన్స్ అనే హార్మోన్‌లాంటి రసాయనాల వల్ల గర్భాశయం సంకోచాలు కలగడం వల్ల వస్తుంది. సాధారణంగా మందులు, జీవనశైలి మార్పులతో దీనిని నియంత్రించవచ్చు. ఇక రెండవది సెకండరీ డిస్మెనోరియా. ఇది గర్భాశయానికి సంబంధించిన ఇతర ఆరోగ్య సమస్యల వల్ల వస్తుంది. దీని వల్ల వచ్చే నొప్పి ఎక్కువగా తీవ్రంగా ఉంటుంది, కాలక్రమేణా



పెరుగుతుంది. అదనంగా అధిక రక్తస్రావం, అలసట, పీరియడ్ కాకుండా కూడా పెల్విక్ నొప్పి, మల విసర్జన లేదా లైంగిక సంబంధాల సమయంలో నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

### 20 నుంచి 40 శాతం మంది మహిళల్లో..

సెకండరీ డిస్మెనోరియాకు ప్రధాన కారణాలలో ఒకటి ఎండోమెట్రియోసిస్. ఇందులో గర్భాశయపు లోపలి పొరల మాదిరిగా ఉండే కణజాలం గర్భాశయం బయట పెరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 10 శాతం మహిళలు ఈ సమస్యతో బాధపడుతున్నారు. భారతదేశంలో సుమారు 4.2 కోట్ల మంది మహిళలు ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు అంచనా. దీర్ఘకాలిక పెల్విక్ నొప్పితో బాధపడే మహిళల్లో 30-70 శాతం వరకు ఈ వ్యాధి ఉండే అవకాశముంది. అయినప్పటికీ ఈ సమస్య చాలా సందర్భాల్లో గుర్తించబడదు. అలాగే నెలసరి సమయంలో తీవ్రమైన నొప్పి రావడానికి మరొక కారణం గర్భాశయంలో ఏర్పడే ఫైబ్రాయిడ్స్ (గడ్డలు). ఇవి క్యాన్సర్ కాని గడ్డలు అయినప్పటికీ 20-40 శాతం భారతీయ మహిళల్లో కనిపిస్తాయి. ముందుగా ఇవి పెద్ద వయస్సులో మాత్రమే కనిపిస్తాయని భావించేవారు. కానీ ప్రస్తుత కాలంలో యువతుల్లో కూడా ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. జీవనశైలి మార్పులు, కాలుష్యం, ప్రాసెస్ చేసిన ఆహారం, ఒత్తిడి, స్థూలకాయం, ప్లాస్టిక్‌లో ఉండే హానికర రసాయనాలు వంటి అంశాలు హార్మోన్ అసమతుల్యతకు దారి తీస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి శరీరంలో ఈస్ట్రోజన్‌ను అనుకరించి వాపులను పెంచి, ఫైబ్రాయిడ్స్, ఎండోమెట్రియోసిస్ వంటి సమస్యలకు కారణమవుతున్నాయని వారు తెలియజేస్తున్నారు.


### మందులు దీర్ఘకాలం వద్దు..

నెలసరి నొప్పుల కోసం ఎక్కువగా ఉపయోగించే ఐబుప్రోఫెన్ వంటి నాన్-స్టెరాయిడల్ యాంటీ ఇన్‌ఫ్లమేటరీ మందులు తాత్కాలిక ఉపశమనం ఇస్తాయి. కానీ దీర్ఘకాలం వాడితే జీర్ణాశయ సమస్యలు, అల్సర్లు, కిడ్నీ సమస్యలు, రక్తపోటు వంటి ప్రమాదాలు కలుగుతాయని, ముఖ్యంగా ఇవి అసలు సమస్యను దాచిపెట్టే ప్రమాదం కూడా ఉందని వైద్యులుహెచ్చరిస్తున్నారు. కనుక పీరియడ్ నొప్పులు తరచూ వస్తుంటే లేదా తీవ్రంగా మారితే ఆలస్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలి. మొదట అల్ట్రాసౌండ్ లేదా సోనోగ్రఫీ ద్వారా పరీక్షించి, అవసరమైతే గైనకాలజిస్ట్‌ను సంప్రదించాలని సూచిస్తున్నారు. ప్రారంభ దశలో గుర్తిస్తే రక్తహీనత, గర్భాశయంలో గాయాలు, వంధ్యత్వం వంటి సమస్యలను నివారించవచ్చునని అన్ని వేళలా నెలసరి నొప్పిని తేలికగా తీసుకోకూడదని వైద్యులు సూచిస్తున్నారు.

## మాత్ర వేసుకున్న తర్వాత శరీరంలో ఏం జరుగుతుందో తెలుసా?

ఏ మాత్రం అనారోగ్యానికి గురైనా, శరీరంలో ఏ భాగం నొప్పికి గురైనా వెంటనే గుటుక్కున మాత్ర మింగేస్తుంటారు. కడుపులో అజీర్తి చేసినా, తలనొప్పిగా అనిపించినా మాత్రవైపు దృష్టి మరలుతుంది. మధుమేహమైనా, బీపీని నియంత్రించాలన్నా.. పూటపూటకీ ఓ మందుబిళ్ల పడాల్సిందే. అయితే.. ఈ ట్యాబ్లెట్లకు శరీరంలో నొప్పెక్కడో, సమస్యేంటో ఎలా తెలుస్తుంది? వేసుకున్న కొన్ని నిమిషాలకే ఆ సమస్య నుంచి ఎలా బయటపడేస్తుంది.? వంటి సందేహాలపై ప్రత్యేక వివరణ మీకోసం...





### మాత్ర పనిచేసే విధానం:

మాత్రను మింగిన వెంటనే అది ఈసోఫాగస్(గొంతు మార్గం) ద్వారా కడుపులోకి చేరుతుంది. తర్వాత కడుపులో ఉన్న ఆమ్లాలు దానిని కరిగించడం ప్రారంభిస్తాయి. కొన్ని మాత్రలు వెంటనే కరుగుతాయి. మరికొన్ని ఆలస్యంగా పనిచేస్తాయి. మాత్రలోని ఔషధ పదార్థాలు చిన్నపేగు ద్వారా రక్తంలోకి శోషణం చెందుతాయి. ఇది అత్యంత కీలక దశగా వైద్య నిపుణులు చెబుతారు. రక్తం ద్వారా అందులోని ఔషధాలు శరీరంలోని వివిధ భాగాలకు చేరతాయి. అవసరమైన అవయవం వద్ద అది ఎక్కువగా పనిచేస్తుంది. ఇక్కడే అసలు పని ప్రారంభమవుతుంది.

నొప్పి మందులైతే నాడీ వ్యవస్థపై పనిచేస్తాయి. ు ాంటీబయోటిక్స్ అయితే బ్యాక్టీరియాను నాశనం చేస్తాయి. ఇతర మందులు హార్మోన్లు లేదా రసాయన చర్యలను నియంత్రిస్తాయి. లివర్(కాలేయం) ఔషధాన్ని రసాయన మార్పులకు గురిచేస్తుంది. దీనినే విఘటన(మెటబాలిజం) అంటారు. చివరగా కిడ్నీలు(మూత్రపిండాలు), మలవిసర్జన ద్వారా ఔషధ అవశేషాలు శరీరం నుంచి బయటకు వెళ్లిపోతాయి.

పాటించాల్సిన నియమాలు: సమయపాలన: ఏ మాత్రను ఎలా వేసుకోవాలనే(తిన్న తర్వాత లేదా ఖాళీ కడుపుతో) విషయమై తప్పనిసరిగా వైద్యుల సలహాను పాటించాలి. ఇది మందుల శోషణపై ప్రభావం చూపుతుంది. విశ్రాంతి: మందులు వేసుకున్నాక శరీరానికి తగినంత విశ్రాంతి ఇవ్వాలి.

విసర్జన: కాలేయం, మూత్రపిండాలు సరిగ్గా పనిచేస్తున్నప్పుడే మందులు సక్రమంగా పనిచేస్తాయి.

ముఖ్య గమనిక: ప్రతి మందు ఒకేలా పనిచేయదు. డాక్టర్ సూచించిన మోతాదు మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. తప్పుగా వాడితే దుష్ప్రభావాలు వచ్చే అవకాశముంది.

## రోడ్డు ప్రమాదంలో గ్రామ పంచాయతీ కార్మికుడి దుర్మరణం



జనగామ జిల్లా/రఘునాథపల్లి/ ( అక్షరం న్యూస్ ) జూన్ 25: రోడ్డు ప్రమాదంలో రఘునా థపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు దుర్మరణం చెందిన సంఘటన మండల కేంద్రంలోని వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. రఘునాథపల్లికి చెందిన కర్రె ఏల్లయ్య (65) సతీష్ ఫోటో స్టూడియో ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డు నుండి జాతీయ రహదారిని దాటుతున్న క్రమంలో వరంగల్ నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతి వేగంగా ఢీ-కొనడంతో తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావం కావడం వల్ల అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ కారును ఆపకుండానే పరారయ్యాడు. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని జనగామ జిల్లా ఆస్పత్రి మార్చురికి తరలించారు. మృతుడికి భార్య నాగమణి, కుమారుడు రాజు, కుతూరు ధనలక్ష్మి ఉన్నారు. ఎల్లయ్య మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. ప్రమాదానికి కారణమైన కారును గుర్తించేందుకు జాతీయ రహదారి పక్కన ఉన్న సీసీ కెమేరాల పుటేజీలను పరిశీలించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు

## పోత్కపల్లి రైతు వేదికలో విత్తన సమ్మేళనం



ఓదెల /పెద్దపల్లి జూన్ 25(అక్షరం న్యూస్)

ఓదెల మండలంలోని పోత్కపల్లి రైతు వేదిక కార్యాలయంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్ ఆధ్వర్యంలో విత్తన మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువులు విత్తనాలు ఏర్పాటు చేసి అవసరమైన విత్తనాలు, వ్యవసాయ ఉత్పత్తులను రైతులకు ప్రదర్శించారు. ఈ మేళాలో 7 రకాల వరి విత్తనాలు, రైతులకు అందించారు అదేవిధంగా, నానో యూరియా, నానో డి ఏ పి అందుబాటులో పెట్టారు. రైతులకు విత్తనాల ఎంపిక, నూతన సాంకేతిక పద్ధతులు, నానో ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉన్న పరిస్థితుల్లో తక్కువ నీటి లభ్యతతో పంటను సాగు చేయడం అనుకూలమని తెలిపారు. నీటి పొదుపు పద్ధతులతో పంట సాగు చేపట్టి మంచి దిగుబడులు సాధించవచ్చని రైతులకు సూచించారు. ఆసక్తి గల రైతులు సమీపంలోని రైతు వేదికలను సందర్శించి నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని కోరారు. నాణ్యమైన విత్తనాల వినియోగం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో

మండల వ్యవసాయ అధికారి భాస్కర్ తో పాటు ఏఈవోలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## రైతు భరోసా పథకానికి దరఖాస్తు చేసుకోగలరు

- ఏవో



ఓదెల/ పెద్దపల్లి జూన్ 25(అక్షరం న్యూస్)

ఇటీవల కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకొనికొత్తగా పట్టాదారు పాస్ పుస్తకం వచ్చిన రైతులు వానకాలం 2026 పంటల సాగు కు పెట్టుబడి సహాయం " రైతు భరోసా" పథకం కొరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలం లో కొత్తగా 117 పట్టా పాస్ పుస్తకాలు వచ్చాయని. రైతులు ఆ గ్రామ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కావలసిన పత్రాలు:

1) కొత్త పాస్ బుక్ లేదా డిజిటల్ సంతకం అయిన భూ భారతి ఆన్లైన్ కాపీ నకలు
2) బ్యాంకు పాస్ పుస్తకం
3) ఆధార్ కార్డు
4) దరఖాస్తు ఫారం

అన్ని జిరాక్స్లు తీసుకొచ్చి సంబంధిత వ్యవసాయ అధికారికి అందజేయాలని అదేవిధంగా

గతం లో రైతు భరోసా పథకం లబ్ది పొందే వారు మళ్ళీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. ఏమైనా బ్యాంకు ఖాతాలు మార్చుకోవాలి అనుకునే వారు ఏఈఓ లను సంప్రదించాలని కోరారు రైతులు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు

## పశ్చిమాసియాలో నెలకొంటున్న శాంతి

- ఉద్రిక్తతలు తగ్గడంతో మార్కెట్లో సానుకూల పరిస్థితి
- 72.28 డాలర్లకు పడిపోయిన బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర
- బంగారం ధరలు కూడా భారీగా తగ్గుతున్నట్లు అంచనా

న్యూఢిల్లీ,జూన్25 పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారడంతో చమురు రవాణాకు జీవనాడి అయిన హార్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలు వేగవంతం అవుతున్నాయి. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గత కొన్ని రోజులుగా చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. తాజాగా బ్రెంట్ క్రూడ్ ధర అమెరికా-ఇరాన్ యుద్ధం ముందు స్థితికి పడిపోవడం ఊరటనిస్తోంది. గురువారం ఉదయం బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.28 డాలర్లకు పడిపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే దీని ధర 4శాతం మేర తగ్గడం గమనార్హం. ఇక, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియెట్ క్రూడాయిల్ ధర 1.69శాతం తగ్గి బ్యారెల్‌కు 69.15 డాలర్లు పలికింది. ఇటీవలి కాలంలో దీని ధర 70 డాలర్ల దిగువకు చేరడం ఇదే తొలిసారి. గడిచిన 24 గంటల్లో హార్మూజ్ జలసంధి మీదుగా కనీసం 2 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా అయినట్లు అమెరికా ఇంధన మంత్రిత్వశాఖ వెల్లడించింది. రాబోయే కొన్ని వారాల్లోనే ఈ జలమార్గంలో చమురు రవాణా యుద్ధం మునుపటి స్థాయికి పెరుగుతుందని అంచనా వేసింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.

అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 3996 డాలర్లకు చేరింది. వెండి (ధర 57.35 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతోంది. దీంతో హైదరాబాద్ విపణిలో గురువారం ఉదయం 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.1.44లక్షలు పలికింది. కిలో వెండి ధర రూ.2.22లక్షలకు దిగొచ్చింది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1.41లక్షలు (10 గ్రాములకు), వెండి ఫ్యూచర్ ధర రూ.2.13లక్షలుగా (కిలోకు) ట్రేడ్ అవుతోంది. మరోవైపు, దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు కూడా గురువారం లాభాల్లో కొనసాగాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలకు తోడు.. దేశీయంగా బ్యాంకింగ్, స్థిరాస్తి రంగ సూచీల్లో కొనుగోళ్లు సూచీలకు మద్దతుగా నిలిచాయి. దీంతో ఉదయం 10 గంటల సమయంలో సెన్సెక్స్ 511.62 పాయింట్లు పెరిగి 77,502 వద్ద, నిఫ్టీ 150 పాయింట్ల లాభంతో 24,172 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 22 పైసలు పెరిగి 94.33 వద్ద కొనసాగుతోంది.

## నల్లగొండలో నలుగురి అనుమానాస్పద మృతి కేసు

- పోలీసుల అదుపులో ఆరుగురు సుపారీ హంతకులు ?

నల్గొండ,జూన్25: జిల్లా కేంద్రంలోని తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి అనుమానాస్పద మృతి కేసు కీలక మలుపు తిరిగింది. భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్(45), హసీనా(38), కుమారుడు ముజామిల్(20), కూతురు అఫోర(14)ను నిందితులు విచక్షణారహితంగా హత్య చేసినట్టు పోలీసులు గుర్తించారు. సుపారీ గ్యాంగ్‌లోని ఆరుగురు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకొని రహస్య ప్రాంతంలో విచారిస్తున్నట్టు సమాచారం. కుటుంబ గొడవలు, ఆస్తి తగాదాలే హత్యలకు కారణంగా భావిస్తున్నారు. ఈనెల 22న హత్యలు జరగ్గా.. ఘటనాస్థలిలో ఏ ఒక్క ఆధారం లభ్యం కాకపోయినప్పటికీ పోలీసులు తీవ్రంగా శ్రమించి .. సుపారీ గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పదునైన ఆయుధంతో దాడిచేసి హత్య చేసినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలిందని పోలీసులు తెలిపారు. నగరంలోని ప్రకాశం బజార్‌లో సుల్తాన్ బ్యాగులు విక్రయించే వ్యాపారం చేస్తున్నారు. దంపతుల మధ్య కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. మద్యం తాగి తరచూ ఇంటికి వచ్చి సుల్తాన్ గొడవ పెట్టుకునేవారని స్థానికులు చెబుతున్నారు. వీరి కుమారుడు ముజామిల్ ఏసీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. హసీనా ఓ ప్రైవేటుపాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. కుమార్తె అఫోర ఇదే పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. సుల్తాన్ మొదటి భార్య మృతిచెందింది. హసీనాతో రెండో వివాహం కాగా ఇప్పుడున్న పిల్లలిద్దరూ సుల్తాన్ మొదటి భార్య పిల్లలని స్థానికులు చెబుతున్నారు.

## గోడౌన్ కూలిన ఘటనలో 8కి చేరిన మృతుల సంఖ్య

- కొనసాగుతున్న సహాయక చర్యలు..సిఎం పర్యవేక్షణ

కోల్‌కతా,జూన్25 మహానగరంలోని తరతల ప్రాంతంలో గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో మరణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించామని అధికారులు వివరించారు. మరో18 మంది గోడౌన్ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో గోడౌన్‌లో 60 మంది వరకు కార్మికులు ఉన్నారని వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ, నగర పోలీసులతోపాటు స్థానికుల సహకారంతో సహయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే.. మంత్రులతో కలిసి సీఎం సువేందు అధికారి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో వైపు బాధితుల కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూం.. 8697981070, 033 22143526, 033 22535185 నెంబర్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం ఈ గోడౌన్ కూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటన జరిగిన వెంటనే ఐదుగురు కార్మికులు మరణించగా.. 20 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే.

## ఫీజు బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదు

- బకాయిలపై ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న
- ప్రైవేట్ యాజమాన్యాలకు స్వల్ప ఊరట

హైదరాబాద్,జూన్25 తెలంగాణ హైకోర్టు లో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 9లోని కొన్ని నిబంధనలపై హైకోర్టు స్టే విధించింది. మంగళవారం వరకు స్టే విధిస్తూ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ హైకోర్టు పలు వ్యాఖ్యలు చేసింది. 'ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయలేదు. మీరు బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల నుంచి యాజమాన్యాలు వసూలు చేయొద్దంటే కళాశాలను వారు ఎలా నడుపుతారు? రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారు?పెండింగ్ బకాయిలు ఎప్పటిలోపు చెల్లిస్తారు?' అని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దీనిపై ప్రభుత్వం తరఫు న్యాయవాది స్పందిస్తూ ఆగస్ట్ 15లోపు బకాయిలు చెల్లిస్తామని బదులిచ్చారు. అలా జరిగితే తమ పిటిషన్లు కూడా వెనక్కి తీసుకుంటామని ప్రైవేట్ కళాశాలల తరఫు న్యాయవాది చెప్పారు. ఇదే అంశంలో విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. విద్యార్థుల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అటు ప్రభుత్వం, ఇటు కళాశాలల యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారన్నారు. ఈ బకాయిలతో విద్యార్థులు నష్టపోకుండా చూడాలని కోర్టును కోరారు. మంగళవారం అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని ప్రభుత్వం తరఫు న్యాయవాది చెప్పారు. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి ఉన్నత న్యాయస్థానం వాయిదా వేసింది.

# ఇరాన్‌తో ఆయిల్ డీల్‌కు మళ్లీ అవకాశం !



న్యూఢిల్లీ,జూన్25 ప్రపంచం బాగుండాలంటే ముందు ట్రంప్ దూకుడుకు అక్కడి పార్లమెంట్ కళ్లెం వేయాలి. ఇరాన్‌పై ఇంకా ఆంక్షలు విధించడం, బెదిరించడం వంటివి చేయకుండా చూసుకోవాలి. ఎందుకంటే ఒక్క ట్రంప్ కారణంగా ప్రపంచం యావత్తూ అతాలకుతలం అయ్యింది. సునీమా వచ్చినంత పనయ్యింది. మళ్లీ కోలుకోవడమెలా అన్న సందిగ్ధంలో ప్రపంచ దేశాలు ఉన్నాయి. అన్ని దేశాల ఆర్థిక స్థితి దిగజారింది. ముఖ్యంగా భారత్ లాంటి అనేక దేవాల్లో ఆర్థిక సంక్షోభం నెలకొంది. ఈ క్రమంలో ఇరాన్‌ను తన మానా తను బతికేలా చూడాలి. ట్రంప్ ఇక తన దేశ పురోగతికి సమయం కేటాయిస్తే చాలు. హార్మూజ్ తెరుచుకోవడం, చమురు ధరలు దిగిరావడం అన్నది ఊరటనిచ్చే అంశం. ముఖ్యంగా భారత్‌కు పెద్ద ఊరట అని చెప్పాలి. అలాగే భారత్ ఎవరి వద్ద చమురు కొనాలో వద్దో అన్నది అమెరికాకు సంబంధించిన వ్యవహారం కాదు. భారత్ ఎవరితో వాణిజ్యం చేయాలో చేస్తుంది. ఎవరితో చమురు డీల్ చేసుకోవాలో చేసుకుంటుంది. అంతేగానీ వేలుపెట్టాలని ఇక ట్రంప్ చేడడం మానుకోవాలి. ట్రంప్ తీరువల్ల అమెరికా ఇప్పటికీ పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయింది. అక్కడా చమురు ధరలు పెరిగాయి. నిరుద్యోగం పెరిగింది. అక్కడున్న వారిని వెళ్లగొట్టే ప్రయత్నంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రణసంకటంగా మారాయి. ముఖ్యంగా భారతీయ టెక్కీలకు ఇదొక సమస్యగా మారింది. ఇకపోతే చమురు ధరలు దిగిరావడం, మళ్లీ హార్మోజ్ తెరుచుకోవడం తో ఇక స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశం వచ్చింది. దీనిపై అటు ట్రంప్ కానీ, ఇటు ఇరాన్ కానీ పేచీలు లేకుండా చూసుకోవాలి. పశ్చిమాసియాలో యుద్ధం ముగియడంతో పాటు ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షలను సడలించడం వంటి కారణాలతో క్రూడాయిల్ ధరలు దిగొస్తున్నాయి.అటు బంగారం, వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో భారత్-ఇరాన్ మధ్య ఇంధన రంగంలో మళ్లీ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్ చమురు మంత్రి మొహ్సెన్ పక్‌నెజాద్ ఈ వారం భారత పెట్రోలియం మరియు సహజ వాయు మంత్రిత్వ శాఖ అధికారులతో సమావేశం కానున్న నేపథ్యంలో, భారత్‌కు ఇరాన్ నుంచి ముడి చమురు సరఫరాల భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ఈ ఏడాది ప్రారంభంలో పరిమిత స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు తిరిగి ప్రారంభమయ్యాయి. అమెరికా ఆంక్షలకు ముందు భారత్‌కు ప్రధాన ముడి చమురు సరఫరాదారుల్లో ఇరాన్ ఒకటి. ముఖ్యంగా తక్కువ ధరలు, అనుకూల క్రెడిట్ సౌకర్యాలు, భారత రిఫైనరీలకు అనువైన నాణ్యత కారణంగా ఇరాన్ చమురుకు మంచి డిమాండ్ ఉండేది. భారత్-ఇరాన్ మధ్య జరగనున్న తాజా చర్చలు ఇంధన రంగంలో కొత్త అవకాశాలకు దారితీయవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఇరాన్ చమురు దిగుమతులు పునరుద్ధరించబడేందుకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉందని, భవిష్యత్ కొనుగోళ్లు వాణిజ్య ప్రయోజనాలు, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు మరియు ఆంక్షల పరిస్థితులపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు చెబుతు న్నారు. 2015లో భారత్ సుమారు 11 మిలియన్ మెట్రిక్ టన్నుల ముడి చమురును ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. అది దేశ మొత్తం చమురు దిగుమతుల్లో 6 శాతం వాటాను కలిగి ఉంది. 2016లో ఈ దిగుమతులు 14 ఎంఎంటీలకు చేరి వాటా 6.7 శాతానికి పెరిగింది. అయితే, 2017లో ఇరాన్ నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ఆ ఏడాది భారత్ 27 ఎంఎంటీల చమురును కొనుగోలు చేయగా, దేశ మొత్తం చమురు అవసరాల్లో ఇరాన్ వాటా 12.6 శాతానికి చేరుకుంది. ఇదే గరిష్ట స్థాయి. 2018లో దిగుమతులు 23 ఎంఎంటీలకు తగ్గినా, ఇరాన్ వాటా 10.4 శాతంగా కొనసాగింది. 2019లో 24 ఎంఎంటీల దిగుమతులతో ఇరాన్ వాటా 10.6 శాతంగా నమోదైంది. అయితే 2019 మేలో అమెరికా ఇరాన్‌పై ఆంక్షలను కఠినతరం చేసి, చమురు కొనుగోలు చేసే దేశాలకు ఇచ్చిన మినహాయింపులను రద్దు చేయడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీంతో భారత్ ఇరాన్ నుంచి చమురు కొనుగోళ్లను నిలిపి వేయాల్సి వచ్చింది. ఈ ప్రభావం 2020లో స్పష్టంగా కనిపించింది. ఆ ఏడాది భారత్ కేవలం 2 ఎంఎంటీల చమురును మాత్రమే ఇరాన్ నుంచి దిగుమతి చేసుకుంది. దీంతో దేశ మొత్తం చమురు దిగుమతుల్లో ఇరాన్ వాటా 1 శాతం కంటే దిగువకు పడిపోయింది. ఇటీవల నేషనల్ ఇరానియన్ ఆయిల్ కంపెనీ (ఎన్ఐఓసీ) భారత రిఫైనరీలు, వ్యాపార సంస్థలను సంప్రదించి భవిష్యత్ చమురు సరఫరాలపై చర్చలు ప్రారంభించి నట్లు సమాచారం. అయితే భారత రిఫైనరీలు ప్రస్తుతం జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. అమెరికా ఆంక్షలపై స్పష్టత, చెల్లింపు విధానాలు, షిప్పింగ్ మరియు బీమా సౌకర్యాలపై భరోసా లభించిన తర్వాతే పెద్ద ఎత్తున కొనుగోళ్లపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. కెప్లర్ డేటా ప్రకారం, జూన్ నెలలో భారత్ రోజుకు సుమారు 73 వేల బ్యారెళ్ల ఇరాన్ ముడి చమురును దిగుమతి చేసుకుంది. ఏప్రిల్‌లో పరిమిత స్థాయిలో పునఃప్రారంభమైన సరఫరాలు క్రమంగా పెరుగుతున్నట్లు ఇది సూచిస్తోంది.

# ట్రిపుల్ తలాక్ ఉండాల్సిందే

- బహుభార్యత్వం కూడా సమర్థనీయమే
- మహారాష్ట్ర అసెంబ్లీలో ఎన్‌సిపి ఎమ్మెల్యే సనా మాలిక్ వ్యాఖ్యలు
- తిప్పికొట్టిన బిజెపి ఎమ్మెల్యేలు..పాక్‌కు వెళ్లాలని హితవు




ముంబై,జూన్25 మహారాష్ట్ర రాజకీయాల్లో యూనిఫామ్ సివిల్ కోడ్, ట్రిపుల్ తలాక్ అంశాలపై కొత్త వివాదం చెలరేగింది. ఎన్‌సీపీ అజిత్ పవార్ వర్గం ఎమ్మెల్యే సనా మాలిక్ అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అలాగే ఆమె వ్యాఖ్యలపై తీవ్ర నిరసనలు కూడా వస్తున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే సానా మాలిక్ చేసిన ప్రకటన కలకలం రేపింది. భారత్ లో ఖురాన్ ఆధారిత చట్టాలను అమలు చేయాలని, ట్రిపుల్ తలాక్‌ను సమర్థించాలని మాలిక్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్, ఖురాన్, ముస్లిం వ్యక్తిగత చట్టాలను ఉటంకిస్తూ, భారతదేశంలో ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని ఎన్‌సీపీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. పాకిస్తాన్ లాగే, భారత్ కూడా ఇస్లామిక్ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామని ఆమె తెలిపారు. ట్రిపుల్ తలాక్‌ను సమర్థిస్తూ సనా మాలిక్.. విడాకులలో వివిధ రూపాలు ఉన్నాయి. తలాక్-ఎ-హసన్, తలాక్-ఎ-అహ్సన్, తలాక్-ఎ-బిద్దత్ అనే మూడు రకాల విడాకులు ఉన్నాయి. ట్రిపుల్ తలాక్‌కు సంబంధించి ఆమోదించిన చట్టం, అప్పటికే ఆచరణలో విస్తృతంగా అమలులో లేని ఒక వ్యవస్థపై ఆధారపడి ఉంది. దాని ప్రస్తావన ఎక్కడా లేదు. ఆ తర్వాత బహుభార్యత్వం గురించి మాట్లాడుతూ, బహుభార్యత్వం కేవలం ఒక మతంలోనే కాకుండా, ప్రతి మతంలోనూ ప్రబలంగా ఉంది. ముస్లింలలో బహుభార్యత్వం గురించి బోధిస్తారు. దానిని పాటించాలి. దీని కోసం ఒక చట్టాన్ని రూపొందించాలని అన్నారు. తన వ్యాఖ్యలకు సంబంధించి సనా మాలిక్ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ఒక వీడియోను పంచుకున్నారు. ట్రిపుల్ తలాక్ చట్టం అమలుపై అసెంబ్లీలో తన అభిప్రాయాన్ని వెల్లడించానని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా అన్ని మతాలకు సమానంగా వర్తించే చట్టాలు ఉండాలని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, ఈ అంశంపై జరిగిన చర్చలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి యోగేష్ కదమ్ స్పందించారని, చట్టాలు అమల్లోకి వచ్చిన తర్వాత అవి అన్ని మతాలకు వర్తిస్తాయని ఆయన చెప్పినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఈ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు సనా మాలిక్ పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రభుత్వ మంత్రి, బీజేపీ ఎమ్మెల్యే నితేష్ రాణెళి మాట్లాడుతూ, ట్రిపుల్ తలాక్ విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయం తీసుకున్నప్పటికీ, అసెంబ్లీలోని కొందరు ఖురాన్, ముస్లిం గ్రంథాలను ఉటంకిస్తూ యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ)ని ఇప్పటికీ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. యూసీసీ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించారు, కానీ కొందరు తమ చట్టవిరుద్ధ చర్యలను సమర్థించుకోవలసి వచ్చినప్పుడు మాత్రమే దానిని ప్రస్తావిస్తారు. ఎవరైనా దేశ చట్టాలను, రాజ్యాంగాన్ని పాటించకూడదనుకుంటే, వారు తమ పదవికి రాజీనామా చేసి పాకిస్తాన్‌కు వెళ్ళిపోవాలి అని సూచించారు.

# జల వివాదాలను పరిష్కరించుకుందాం

పంచాయితీలు కాదు...పరిష్కారాలు ముఖ్యం
తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి
మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి
కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి
తుంగభద్రలో 15 టిఎంసిలకు 5 టిఎంసిలే అందుతున్నాయి
మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

బళ్లారి,జూన్25 తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు. మనందరి కష్టాలు, సమస్యలు తెలిసిన నాయకుడు చంద్రబాబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు. చరిత్రలో ఈరోజు సువర్ణ అక్షరాలతో నిలిచిపోతుందని తెలిపారు. తమకు పంచాయితీలు వద్దని.. పరిష్కారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయలసీమ, తెలంగాణలోని లక్షలాదిమంది రైతుల సమస్యకు తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పరిష్కారమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటి సమస్యను పరిష్కరించక పోవడంతోనే పాలమూరు వాసులు వలసలు వెళ్లాల్సి వస్తోందని అన్నారు. నీటి సమస్యలు ఓ కొలిక్కి వచ్చాయని.. తెలంగాణకు రావాల్సిన నీటి వాటాపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో చర్చించామని తెలిపారు. తుంగభద్రలో పూడికతీతకు సంబంధించిన వ్యవహారంపై కేంద్రమంత్రితో చర్చించామని అన్నారు. తుంగభద్ర నది ఒడ్డున జరిగిన చర్చలు అంతరాష్ట్ర జల వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతాయని తెలిపారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక నీటి సమస్యను సీఆర్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పుకొచ్చారు.

## కంటిని కాపాడుకోండి



మధుమేహం అనగానే చాలామందికి రక్తంలో చకెర స్థాయిలు, ఆహార నియమాలు, గుండె లేదా కిడ్నీ సమస్యలే గుర్తొస్తాయి. కానీ, ఈ మహమ్మారి కంటి చూపును కూడా గుల్ల చేస్తుందనే విషయాన్ని చాలామంది గుర్తించరు. డయాబెటిస్ వల్ల కంటి లోపల తీవ్రమైన నష్టం జరుగుతుంది. ఇండియన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ అండ్ ఎక్స్‌పెరిమెంటల్ ఆప్తమాలజీ నిర్వహించిన ఒక అధ్యయనంలో ఈ దిగ్భ్రాంతికర నిజాలు వెల్లడయ్యాయి. కంటి చూపు బాగుంది కదా అని భావిస్తూ, దాదాపు 60 శాతానికి పైగా బాధితులు కంటి పరీక్షలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ పరిశోధన పేరొంది. డయాబెటిస్ వల్ల వచ్చే కంటి సమస్యలు ఎలాంటి నొప్పి లేదా చూపులో మార్పులు లేకుండానే ఏళ్ల తరబడి లోపల పెరిగిపోతుంటాయి. నగరాల్లోని ఐటీ ప్రొఫెషనల్స్, మధ్య వయసులు, యువతలో షుగర్ వ్యాధి వేగంగా విస్తరిస్తున్నది. సాధారణంగా మధుమేహ బాధితులు బ్లడ్, షుగర్ లెవెల్స్ తరచూ చెక్ చేయించుకుంటారు కానీ, కంటి పరీక్షల జోలికి వెళ్లరు. చూపు మసకబారడం, కళ్ల ముందు నల్లటి చుకలు రావడం లేదా చదవడంలో ఇబ్బంది తలెత్తే వరకు కంటి వైద్యుడిని సంప్రదించరు. ఇలాంటి లక్షణాలు బయటపడే సమయానికే జరగాల్సిన నష్టం జరిగిపోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.


రక్తంలో చకెర స్థాయులు దీర్ఘకాలంపాటు నియంత్రణలో లేనప్పుడు, అవి కంటి లోపల ఉండే సూక్ష్మ రక్తనాళాలను దెబ్బతీస్తాయి. మనం స్పష్టంగా చూడటానికి కారణమైన రెటీనా సక్రమంగా పనిచేయాలంటే ఈ రక్తనాళాలే ఆధారం. షుగర్ తీవ్రత వల్ల ఈ నాళాలు బలహీనపడటం, వాపు రావడం లేదా రక్తం కారడం జరుగుతుంది. ప్రారంభ దశలో దీనివల్ల ఎలాంటి స్పష్టమైన హెచ్చరికలు ఉండవు. లోపల నష్టం జరుగుతున్నా సరే, బాధితుడు ఎప్పటిలాగే చదవడం, డ్రైవింగ్ చేయడం వంటి పనులు చేసుకోగలడు. మధుమేహం వల్ల కంటి శుక్లాలు, గ్లకోమాతో పాటు రెటీనా మధ్య భాగంలో వాపు వచ్చే ప్రమాదం ఉంది. దీనిని డయాబెటిక్ మాక్యులర్ ఎడెమా అని పిలుస్తారు. ఈ సమస్యలు ముదిరితే చిన్న అక్షరాలు చదవడం, ఫోన్ వాడటం, మనుషుల ముఖాలను గుర్తుపట్టడం, రాత్రి పూట డ్రైవింగ్ చేయడం కష్టంగా మారుతుంది. అందుకే చూపు మసకబారే వరకు వేచి చూడకుండా ముందే జాగ్రత్త పడాలి. కంటి చూపు బాగున్నంత మాత్రాన కళ్లు ఆరోగ్యంగా ఉన్నాయని అనుకోవడం పెద్ద పొరపాటు. చూపు స్పష్టంగా ఉన్నవారిలో కూడా డయాబెటిక్ రెటినోపతి అంతర్గతంగా ఉండే అవకాశం ఉంది. క్రమం తప్పకుండా రెటీనా పరీక్షలు చేయించుకోవడం ద్వారా కంటి లోపలి మార్పులను ముందే పసిగట్టవచ్చు. సరైన సమయంలో చికిత్స ప్రారంభించి, షుగర్ లెవెల్స్ అదుపులో ఉంచుకుంటే చూపు కోల్పోయే ప్రమాదాన్ని పూర్తిగా నివారించవచ్చు. డయాబెటిస్ నిర్వహణ అంటే కేవలం బ్లడ్ టెస్టులు, ఇన్సులిన్, మాత్రలకే పరిమితం కాకూడదు. మూడు నెలలకొకసారి చేయించుకునే హెచ్‌బీఏ1సీ పరీక్ష ఎంత ముఖ్యమో, రెటీనా పరీక్ష కూడా అంతే ప్రధానం అని గ్రహించాలి. షుగర్ ఉన్నవారు ఏటా కనీసం ఒకసారైనా పూర్తి కంటి పరీక్ష చేయించుకోవడం తప్పనిసరి. ఇంట్లోని వృద్ధులను ముందస్తు పరీక్షలకు తీసుకెళ్లడంలో కుటుంబ సభ్యులు చొరవ చూపాలి. ఏటా చేయించుకునే ఒకే ఒక సాధారణ కంటి పరీక్ష.. జీవితాంతం వెలుగును కాపాడుతుందనే సత్యాన్ని గ్రహించాలి.

## అతివా.. జాగ్రత్త!



యువతులను టైప్-2 డయాబెటిస్ వెంటాడుతున్నది. గతంతో పోలిస్తే.. చక్కెర వ్యాధి బారినపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. 'డయాబెటిస్ యూకే' ప్రచురించిన తాజా అధ్యయనం, ఈ విషయాన్ని బయటపెట్టింది. 2017 -- 2024 మధ్య కాలంలో, 40 ఏళ్లలోపు మహిళల్లో టైప్-2 డయాబెటిస్ నిర్ధారణ అయిన వారి సంఖ్య 47 శాతం పెరిగిందని ఈ అధ్యయనం వెల్లడించింది. ఇక 40-79 ఏళ్ల మధ్య వయసు గల మహిళల్లో 22 శాతం, 40 ఏళ్లలోపు పురుషులలో 34 శాతం పెరిగినట్లు తేల్చింది. గత కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా టైప్-2 మధుమేహం కేసులలో తీవ్రమైన పెరుగుదల నమోదవుతున్నదని నిపుణులు చెబుతున్నారు. అయితే, వృద్ధులతో పోలిస్తే టైప్-2 మధుమేహం ఆడవాళ్లలో చాలా వేగంగా పెరుగుతున్నదని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గర్భధారణ సమయంలో వచ్చే 'గెస్టేషనల్ డయాబెటిస్' ఇందుకు ప్రధాన కారణమని చెబుతున్నారు. గర్భిణుల్లో సాధారణంగా కనిపించే డయాబెటిస్.. ప్రసవానంతరం తగ్గిపోతుంది. కానీ, గెస్టేషనల్ డయాబెటిస్ వచ్చినవారిలో 11 శాతం మందికి ఐదేళ్లలోపే ప్రీడయాబెటిస్ వచ్చేస్తున్నదట. పదేళ్లలోపు 15 శాతం మందిని పూర్తిస్థాయి టైప్-2 మధుమేహం చుట్టుముడుతున్నదట. అంతేకాకుండా.. గెస్టేషనల్ డయాబెటిస్‌కు గురైన మహిళల్లో 57 శాతం మంది మాత్రమే వార్షిక హెచ్‌బీఏ1సీ పరీక్షలు చేయించుకుంటున్నారట. ఇలా వైద్య పరీక్షలకు దూరంగా ఉండటం కూడా ప్రమాదాన్ని పెంచుతున్నదని అధ్యయనకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక సర్వేలో పాల్గొన్న మహిళల్లో 33 శాతం కన్నా ఎక్కువ మంది.. ప్రసవం తర్వాత ఆరోగ్య సంరక్షణ సేవలకు దూరమైనట్లు చెప్పుకొచ్చారు. టైప్-2 మధుమేహం కేవలం వృద్ధులకు మాత్రమే వస్తుందని భావించేవారు. కానీ, ఇప్పుడు 40 ఏళ్లలోపు వారిలోనే ఎక్కువగా కనిపిస్తున్నది. అంతేకాకుండా యువతలో టైప్-2 మధుమేహం మరింత తీవ్రంగా మారి.. గుండెపోటు, పక్షవాతం లాంటి ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే, గెస్టేషనల్ డయాబెటిస్‌ను ఒక మేల్కొలుపుగా భావించాలనీ, ప్రసవానంతర సంరక్షణలోని లోపాలను సరిదిద్దుకోవాలని సూచిస్తున్నారు. తద్వారా టైప్-2 డయాబెటిస్ రాకముందే.. దానిని నివారించడానికి అవసరమైన పరీక్షలు, జీవనశైలిని అలవాటు చేసుకోవాలని అంటున్నారు.

# ఎనర్జీ డ్రింక్స్‌ను రోజూ తాగుతున్నారా.. అయితే సమస్యలను కొని తెచ్చుకున్నట్లే..



ఎనర్జీ డ్రింక్స్ గత రెండు దశాబ్దాలుగా యువతలో విపరీతమైన ఆదరణ పొందాయి. ఇవి కేవలం పానీయాలుగా కాకుండా ఉత్సాహం, వేగం, సాహసానికి ప్రతీకగా ప్రచారం చేయబడటంతో విద్యార్థులు, యువ ఉద్యోగుల్లో వీటి వినియోగం పెరిగింది. పరీక్షల కోసం రాత్రిళ్లు మేల్కొని చదివే విద్యార్థులు, ఎక్కువసేపు పని చేసే ఉద్యోగులు తక్షణ శక్తి కోసం వీటిని ఆశ్రయించడం సాధారణమైంది. అయితే తరచూ ఎనర్జీ డ్రింక్స్ తీసుకోవడం ఆరోగ్యంపై, ముఖ్యంగా మూత్రపిండాలపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అప్పుడప్పుడు ఒకటి లేదా రెండు ఎనర్జీ డ్రింక్స్ తీసుకోవడం సాధారణంగా పెద్ద సమస్య కాదని నిపుణులు చెబుతున్నారు. కానీ వాటిని రోజువారీ అలవాటుగా మార్చుకోవడం వల్ల ఆరోగ్యపరమైన ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

### కెఫిన్‌తో రక్తపోటు ముప్పు..

ఎనర్జీ డ్రింక్స్ తాగిన తర్వాత కలిగే ఉత్సాహానికి ప్రధాన కారణం వాటిలో ఉండే అధిక మోతాదు కెఫిన్, ఇతర ఉత్తేజక పదార్థాలు. టౌరిన్, గ్వారానా వంటి పదార్థాలు కూడా వీటిలో సాధారణంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని తాత్కాలికంగా చురుకుగా మార్చినా, అధిక మోతాదులో తీసుకుంటే రక్తపోటును పెంచి మూత్రపిండాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తాయి. దీర్ఘకాలంగా అధిక పరిమాణంలో ఎనర్జీ డ్రింక్స్ తీసుకునేవారిలో మూత్రపిండాల వ్యాధుల ప్రమాదం పెరిగే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మధుమేహం లేదా రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలు ఇప్పటికే ఉన్నవారిలో ఈ ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. ఎనర్జీ డ్రింక్స్ వల్ల కలిగే మరో ప్రధాన సమస్య డీహైడ్రేషన్. వీటిలోని ఉత్తేజక పదార్థాలు శరీరంలో నీటి సమతుల్యతను ప్రభావితం చేయడంతోపాటు మూత్రపిండాలకు వెళ్లే రక్తప్రసరణను తగ్గించే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితులు కలిసి మూత్రపిండాల పనితీరును దెబ్బతీస్తాయి.

### అధిక చక్కెరతో కిడ్నీలపై భారం..

చాలా ఎనర్జీ డ్రింక్స్‌లో చక్కెర కూడా అధిక మోతాదులో ఉంటుంది. ఒకే క్యాన్‌లో 40 గ్రాముల కంటే ఎక్కువ చక్కెర ఉండే సందర్భాలు కూడా ఉన్నాయి. అధిక చక్కెర తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ ఒక్కసారిగా పెరిగి తర్వాత వేగంగా పడిపోవడం జరుగుతుంది. ఇది శరీరానికి అదనపు ఒత్తిడిని కలిగించడంతోపాటు డీహైడ్రేషన్ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. అధిక చక్కెర వినియోగం యూరిక్ యాసిడ్ స్థాయిలను కూడా పెంచే అవకాశం ఉంటుంది. ఇది మూత్రపిండాల ఆరోగ్యానికి అనుకూలం కాదు. ఆరోగ్యంగా ఉన్న యువకులు కూడా తక్కువ సమయంలో అధిక పరిమాణంలో ఎనర్జీ డ్రింక్స్ తీసుకోవడం వల్ల అకస్మాత్తుగా మూత్రపిండాల గాయం (అక్యూట్ కిడ్నీ ఇంజరీ) బారిన పడిన సంఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి.

### దీర్ఘకాలంలో ప్రమాదమే..

ఎనర్జీ డ్రింక్స్ తక్షణ శక్తిని అందిస్తున్నట్లు అనిపించినప్పటికీ, వాటి ప్రభావం తాత్కాలికమే. అధిక వినియోగం వల్ల గుండె వేగం పెరగడం, రక్తపోటు అధికమవడం, నిద్ర సమస్యలు, ఆందోళన వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి. ఆరోగ్య నిపుణుల సూచన ప్రకారం శక్తి కోసం ఎనర్జీ డ్రింక్స్‌పై ఆధారపడటానికి బదులుగా సరిపడా నిద్ర, సమతుల ఆహారం, తగినంత నీరు తాగడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం మంచిది. ఆకర్షణీయమైన ప్రకటనలకు ప్రభావితమై ఎనర్జీ డ్రింక్స్‌ను రోజువారీ జీవితంలో భాగంగా మార్చుకోవడం కంటే, పరిమితంగా మాత్రమే తీసుకోవడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

# టీకాతో రక్ష.. సర్వైకల్ క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ సరైన పరిష్కారం



మహిళలను వెంటాడుతున్న క్యాన్సర్లలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) ఒకటి. మహిళా ప్రపంచాన్ని పీడిస్తున్న క్యాన్సర్లలో ఇది నాలుగోది. ఈ వ్యాధిని తొలి దశలోనే గుర్తించి, సరైన చికిత్సతో నివారించవచ్చు. ఈ రెండిటిలో ఏది ఆలస్యమైనా ప్రాణాంతకంగా పరిణమించవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ ముప్పుని టీకాతో ముందే తప్పించుకునేందుకు సిద్ధం కావొచ్చని సలహా ఇస్తున్నారు. సర్వైకల్ క్యాన్సర్ ఎలా వస్తుంది? ఈ వ్యాధి రాకుండా చేసేందుకు అందుబాటులో ఉన్న టీకాల గురించి నేటి ఊపిరిలో తెలుసుకుందాం. శరీర భాగాల్లో కణాలు అసాధారణంగా పెరిగిపోతూ ఇతర భాగాలకు వ్యాపించడాన్ని వైద్య పరిభాషలో 'క్యాన్సర్' అంటారు. గర్భాశయ ముఖద్వారంలో కణాలు అసాధారణంగా పెరగడాన్ని 'సర్వైకల్ క్యాన్సర్'గా పరిగణిస్తారు. గర్భాశయ ముఖద్వారం నుంచి క్యాన్సర్ కణాలు ఇతర భాగాలకూ వ్యాపిస్తాయి. మొదట్లో వ్యాధి లక్షణాలు స్వల్పంగానే ఉంటాయి. కొన్నిసార్లు ఆ కొద్దిపాటి లక్షణాలు కూడా బయటపడకపోవచ్చు. కొన్నిసార్లు ఇన్ఫెక్షన్, మూత్రంలో దుర్వాసన తదితర అస్పష్టమైన లక్షణాలను గమనించవచ్చు. అదనంగా వెన్నునొప్పి ఉంటుంది. కలయికకు ముందు లేదా తర్వాత రక్తస్రావం ఉంటుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అనేది హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) ఇన్ఫెక్షన్ కారణంగా వస్తుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు 90 శాతం 'హెచ్‌పీవీ-16, హెచ్‌పీవీ-18' వేరియెంట్ వైరస్ ఇన్‌ఫెక్షన్లే కారణం. హెచ్‌పీవీ ఇన్ఫెక్షన్ బారినపడ్డ మహిళలలో సహజంగా ఉండే వ్యాధి నిరోధకత కారణంగా కొన్నిసార్లు క్యాన్సర్ లక్షణాలు వాటంతట అవే తగ్గుతాయి.

### ప్రధాన కారణాలు

పలువురితో లైంగిక సంబంధాలు కలిగి ఉండడం ధూమపాన వ్యసనం. బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ గర్భ నిరోధక మాత్రలు విచ్చలవిడిగా వాడటం. యుక్త వయసుకు రాకముందే లైంగిక సంబంధాలు కలిగి ఉండటం

### సర్వైకల్ స్క్రీనింగ్


గర్భాశయాన్ని స్క్రీనింగ్ చేయడం ద్వారా సర్వైకల్ క్యాన్సర్ ఉన్నదీ లేనిదీ గుర్తించవచ్చు. ఒకవేళ వ్యాధి ఉంటే ఎంతమేరకు విస్తరించిందో కూడా నిర్ధారించవచ్చు. క్యాన్సర్‌కు ముందస్తు దశ ఎక్కువ కాలంపాటు ఉంటే... సర్వైకల్ క్యాన్సర్ వల్ల తీవ్ర అనారోగ్యం పాలవుతారు. చివరికి మరణం సంభవిస్తుంది. తొలి దశలోనే వ్యాధిని గుర్తిస్తే.. పరిస్థితి విషమించకుండా ప్రాణాలను కాపాడుకోవచ్చు.

### నిర్ధారణ - చికిత్స


సర్వైకల్ క్యాన్సర్‌ను 'పాప్ స్మియర్' పరీక్ష చేసి గుర్తిస్తారు. దీని కోసం గర్భాశయం నుంచి కణజాలాన్ని సేకరిస్తారు. ఈ పరీక్షలో పొరపాట్లకు ఆస్కారముంది. కొన్నిసార్లు తప్పుగా 'పాజిటివ్' రిజల్ట్ ఇస్తుంది. కాబట్టి బయాప్సీ పరీక్ష ద్వారా కచ్చితమైన నిర్ధారణ చేయవచ్చు. ఈ రెండు పరీక్షలే కాకుండా ఎసిటిక్ ఆమ్లం, ల్యూగోల్స్ అయోడిన్ తదితర చవకైన పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయి. క్యాన్సర్ ఏ మేరకు విస్తరించిందో తెలుసుకోవడానికి మాత్రం హిస్టోపాథలాజికల్ పరీక్ష చేస్తారు. సర్వైకల్ క్యాన్సర్ తొలి దశలో ఉన్నప్పుడు సర్జరీతో నయం చేయవచ్చు. కీమోథెరపీ, రేడియో థెరపీ కూడా అవసరమవుతాయి. తొలి దశలో గుర్తించి, చికిత్స చేస్తే వ్యాధి నివారణ సులువు. చికిత్సకు ఖర్చు కూడా తక్కువే అవుతుంది. వ్యాధి ముదిరేకొద్దీ చికిత్సా కాలం కూడా పెరుగుతుంది. దీర్ఘకాలిక చికిత్స వల్ల వైద్యానికి ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుంది.

### వ్యాక్సినే రక్ష

సర్వైకల్ క్యాన్సర్‌ని 2050 నాటికి నిర్మూలించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఒక వ్యూహం రూపొందించింది. 15 ఏండ్ల వయసు కలిగిన బాలికల్లో 90 శాతం మందికి వ్యాక్సిన్లు వేయడం, 35 ఏండ్ల వయసు దాటిన మహిళల్లో 70 శాతం మందికి సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం ద్వారా సర్వైకల్ ముప్పుని అధిగమించాలని కార్యాచరణ ప్రకటించింది. సర్వైకల్ క్యాన్సర్‌కు కారణమయ్యే ఇన్‌ఫెక్షన్లలో ప్రధానమైన రెండు హెచ్‌పీవీ వేరియెంట్లకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. ఈ వ్యాక్సిన్ల వల్ల 90 శాతం రక్షణ లభిస్తుంది. మిగతా పదిశాతం రక్షణ కోసం సురక్షిత లైంగిక విధానాలను పాటించాలి. తరచూ స్క్రీనింగ్ చేయించుకోవాలి. సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ ఖరీదైనది కావడం కూడా ఒక సమస్యగా గుర్తించి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ, సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియాతో కలిసి 'సర్వివాక్' పేరుతో దేశీయ టీకాను అభివృద్ధి చేసింది. తొమ్మిది నుంచి పదిహేనేండ్ల బాలికలకు ఈ టీకా ఇస్తే హ్యూమన్ పాపిల్లోమా వైరస్‌కు 1000 రెట్ల యాంటి బాడీస్ ఉత్పత్తి అవుతాయి. ఆ వైరస్‌ల బారినపడినప్పుడు వ్యాధి నిరోధక వ్యవస్థ గరిష్ఠ ప్రభావం చూపుతుంది. అందువల్ల హెచ్‌పీవీ ఇన్‌ఫెక్షన్ బారినపడరు. కాబట్టి సర్వైకల్ క్యాన్సర్ ప్రమాదం తప్పుతుంది. సురక్షిత శృంగారానికి పరిమితమై, విశృంఖల లైంగిక సంబంధాలకు దూరంగా ఉంటే హ్యూమన్ పాపిలోమా వైరస్ బారినపడరు. సర్వైకల్ క్యాన్సర్ ముప్పు ఉండదు. క్యాన్సర్ బాధిత మహిళల మరణాల్లో సర్వైకల్ క్యాన్సర్‌ది నాలుగో స్థానం. మన దేశంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వేగంగా విస్తరిస్తున్నది. ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక మహిళ ఈ క్యాన్సర్‌తో మరణిస్తున్నది. 'గ్లోబోకాన్-2020' నివేదిక ప్రకారం.. భారత దేశంలో క్యాన్సర్ మృతుల్లో 18.3 శాతం మంది సర్వైకల్ క్యాన్సరే కారణం. క్యాన్సర్ బాధిత మహిళల్లో 6.29 శాతం మంది సర్వైకల్ క్యాన్సర్ పీడితులున్నారు. ప్రతి లక్ష మందిలో 18 మంది ఈ వ్యాధితో మరణిస్తున్నారు. అన్ని వయసులలోనూ పరిగణనలోకి తీసుకుంటే లక్ష మందిలో 422.82 మంది సర్వైకల్ క్యాన్సర్‌తో మరణిస్తున్నారు. అయితే, 60 శాతం మందిలో సర్వైకల్ క్యాన్సర్లని చివరి దశలో గుర్తిస్తున్నారు.



# వేసవిలో ఎండ వేడి, ఎండ దెబ్బను తప్పించుకోవాలంటే.. జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి...



వేసవి కాలం మొదలవడంతో వడగాలుల తీవ్రత పెరిగి శరీరంపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువవుతున్నాయి. ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతలు వరుసగా కొన్ని రోజులు కొనసాగితే శరీరం తన అంతర్గత ఉష్ణోగ్రతను సమతుల్యం చేయడానికి ఎక్కువగా శ్రమిస్తుంది. చెమట పట్టడం, రక్త ప్రసరణ పెరగడం ద్వారా శరీరం చల్లబడేందుకు ప్రయత్నిస్తుంది. అయితే రోజువారీ అలవాట్లలో కొన్ని పొరపాట్లు ఈ ప్రక్రియను మరింత కష్టతరం చేస్తాయి. ఒక అధ్యయనం ప్రకారం వడగాలులు ముఖ్యంగా వృద్ధులు, పిల్లల్లో మరణాల ముప్పును పెంచడంతో పాటు ఆందోళన, నిరాశ వంటి మానసిక సమస్యలకు కూడా కారణమవుతాయి. కాబట్టి హీట్ ఎగ్జాషన్, హీట్ స్ట్రోక్ వంటి సమస్యలను నివారించాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి అని వైద్యులు సూచిస్తున్నారు.

### మధ్యాహ్నం తరువాత బయటకు వద్దు..

వడగాలుల సమయంలో ఎక్కువగా జరిగే పొరపాటు నీరు తక్కువగా తాగడం. చెమట ద్వారా శరీరం ఎక్కువ నీటిని కోల్పోతుంది. ఈ నీటిని భర్తీ చేయకపోతే డీహైడ్రేషన్ సమస్య వస్తుంది. దీని వల్ల తల తిరగడం, తలనొప్పి, అలసట, దృష్టి లోపం వంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి రోజంతా తరచుగా నీరు తాగడం అవసరం. అలాగే మధ్యాహ్నం, ఆ తరువాతి గంటలు రోజులో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉండే సమయం. ఈ సమయంలో ఎక్కువసేపు బయట గడపడం హీట్ సంబంధిత సమస్యల ముప్పును పెంచుతుంది. వీలైనంత వరకు ఈ సమయంలో బయటకు వెళ్లకుండా, చల్లని ప్రదేశాల్లో ఉండటం మంచిది. అదే విధంగా దుస్తులు కూడా శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి. బిగుతైన దుస్తులు, గాఢ రంగులు వేడిని ఎక్కువగా నిల్వ చేస్తాయి. దీంతో చర్మానికి గాలి సరిగా అందదు. తేలికపాటి, లూజ్‌గా ఉండే, లైట్ కలర్ దుస్తులు ధరించడం ద్వారా శరీరం సులభంగా చల్లబడుతుంది.

### ఆహారం మానేయకూడదు..

అంతేకాకుండా చెమట, కండరాల నొప్పులు, వికారం, తల తిరగడం వంటి లక్షణాలు శరీరం వేడిని తట్టుకోలేకపోతున్న సంకేతాలు. ఈ లక్షణాలను చాలా మంది నిర్లక్ష్యం చేస్తారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే పరిస్థితి తీవ్రమై హీట్ స్ట్రోక్‌కు దారితీయవచ్చు. కనుక ఈ లక్షణాలను గమనించిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. అలాగే కాఫీ, మద్యం వంటి పానీయాలు శరీరంలో నీటి నష్టాన్ని పెంచుతాయి. దీంతో డీహైడ్రేషన్ మరింత పెరుగుతుంది. వీటి బదులు నీరు, తాజా జ్యూసులు, ఎలక్ట్రోలైట్ పానీయాలు తీసుకోవడం మంచిది. ఎండలో ఆకలి తగ్గడం సహజం. కానీ పూర్తిగా ఆహారం మానేయడం సరైంది కాదు. శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోతే శక్తి తగ్గిపోతుంది. పండ్లు, కూరగాయలు, నీరు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడం వంటివి చేయాలి. ఎక్కువ వేడి ఉన్న సమయంలో కఠినమైన వ్యాయామం లేదా శారీరక శ్రమ చేయడం శరీర ఉష్ణోగ్రతను వేగంగా పెంచుతుంది. అవసరమైతే ఉదయం లేదా సాయంత్రం సమయంలో మాత్రమే వ్యాయామం చేయడం సురక్షితమని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు వేడికి ఎక్కువగా ప్రభావితమవుతారు. వీరిని వేడి ప్రదేశాల్లో ఉంచడం, నీరు తాగించకపోవడం ప్రమాదకరం. వీరు ఎప్పుడూ చల్లని ప్రదేశాల్లో ఉండేలా చూసుకోవాలి.

### వడగాలులతో తీవ్రమైన ముప్పు..

వడగాలులు ఆరోగ్యానికి తీవ్రమైన ముప్పు కలిగించవచ్చు. అయితే సాధారణ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ ముప్పును తగ్గించవచ్చు. తగినంత నీరు తాగడం, ఎండలో బయటకు వెళ్లడాన్ని తగ్గించడం, సరైన దుస్తులు ధరించడం, శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. రోజువారీ అలవాట్లలో చిన్న మార్పులు చేసుకుంటే, అధిక ఉష్ణోగ్రతలను శరీరం సులభంగా తట్టుకోగలదు. జీవనశైలిలో ఈ మార్పులు చేసుకోవడం వల్ల హీట్ స్ట్రోక్ కు గురి కాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చునని వైద్యులు తెలియజేస్తున్నారు.

# మెదడుకు అసలైన విశ్రాంతి ఇవ్వడం అంటే ఏంటి.. ఏం చేయాలి..?



ఇప్పటి వేగవంతమైన జీవనశైలిలో చాలామంది మానసికంగా అలసిపోయాం అని చెబుతుంటారు. అయితే ఈ అనుభూతి నిజమైన అలసట కాకపోవచ్చు. ఎక్కువ సందర్భాల్లో అది జ్ఞానాత్మక ఒత్తిడి (కాగ్నిటివ్ ఓవర్లోడ్) అయి ఉండవచ్చు. ఉదయం లేవగానే మెదడు సమాచారం ప్రాసెస్ చేయడం ప్రారంభిస్తుంది. నోటిఫికేషన్లు, మెసేజ్‌లు, సంభాషణలు, పనుల గడువులు, చుట్టూ ఉండే శబ్దం, డిజిటల్ కంటెంట్ వంటివన్నీ దృష్టిని ఆకర్షిస్తాయి. శారీరక అలసటలా ఇది స్పష్టంగా కనిపించదు. మెదడు ఇప్పటికే తీసుకున్న సమాచారాన్ని ప్రాసెస్ చేయకముందే మరిన్ని ఇన్‌పుట్‌లను స్వీకరిస్తూనే ఉంటుంది. ఈ నిరంతర ఉద్దీపన ప్రభావం కాలక్రమేణా బయటపడుతుంది. దృష్టి లోపించడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం, చిరాకు, సృజనాత్మకత తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలా మంది దీనిని మెంటల్ డ్రెయిన్ గా భావించినా, అసలు కారణం మెదడుపై అధిక సమాచారం భారం పడటమే.

### నిరంతరం పనిచేయదు..

మనిషి మెదడు నిరంతరం పని చేయడానికి రూపొందించబడలేదు. శరీర కండరాలకు విశ్రాంతి అవసరమైనట్లే, మెదడుకూ విరామం అవసరం. ఈ విరామాలు సమాచారాన్ని సరిచేయడానికి, భావోద్వేగాలను నియంత్రించడానికి, ఆలోచనలను క్రమబద్ధం చేయడానికి సహాయపడతాయి. అయితే చాలామంది సోషల్ మీడియా స్క్రోలింగ్ లేదా టీవీ చూడడాన్ని విశ్రాంతిగా భావిస్తారు. కానీ ఇవి కూడా మెదడును ఉద్దీపన చేస్తాయి. చిత్రాలు, శబ్దాలు, సమాచారం వంటివి మెదడును పనిచేయించే కారణంగా, ఇది నిజమైన విశ్రాంతి కాదని నిపుణులు చెబుతున్నారు.


### ఏం చేయాలి..

మెదడుకు నిజమైన విశ్రాంతి ఇవ్వాలంటే ఉద్దేశపూర్వకంగా నిశ్శబ్ద సమయాన్ని కేటాయించాలి. నిశ్శబ్దంగా కూర్చోవడం, శ్వాసపై దృష్టి పెట్టడం, ధ్యానం చేయడం, ప్రకృతిలో గడపడం, లేదా ఎలాంటి అంతరాయం లేకుండా ఆలోచనలను స్వేచ్ఛగా ప్రవహించనివ్వడం వంటి చర్యలు మెదడును రీసెట్ చేయడంలో సహాయపడతాయి. అదేవిధంగా నాణ్యమైన నిద్ర కూడా మానసిక శక్తిని పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మెదడుకు సరైన విశ్రాంతి లేకుండా నిరంతరం పని చేయిస్తే శరీరం స్ట్రెస్ హార్మోన్లను విడుదల చేస్తూనే ఉంటుంది. దీని వల్ల నర వ్యవస్థ ఎప్పుడూ అప్రమత్త స్థితిలో ఉంటుంది. ఈ ఒత్తిడి తక్కువగా అనిపించినా, దీర్ఘకాలంలో మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో చిరాకు, మతిమరుపు, భావోద్వేగ అలసట వంటి సమస్యలు పెరుగుతాయి. మరోవైపు సమయానుకూలంగా విరామాలు తీసుకుంటే దృష్టి పెరుగుతుంది, భావోద్వేగ స్థిరత్వం మెరుగుపడుతుంది, సవాళ్లను సమర్థంగా ఎదుర్కోగల సామర్థ్యం పెరుగుతుంది

### అలా చేయడం సోమరితనం కాదు..

ఎప్పుడూ బిజీగా ఉండడాన్ని గొప్పగా భావించే సమాజంలో కొంతసేపు ఆగడం చాలా మందికి అసౌకర్యంగా అనిపిస్తుంది. విశ్రాంతి తీసుకుంటే పనితీరు తగ్గుతుందని భావిస్తారు. కానీ నిజానికి ఇది తప్పు అభిప్రాయమని నిపుణులు చెబుతున్నారు. లోతైన విశ్రాంతి సోమరితనం కాదు, అది మెదడుకు అవసరమైన మద్దతు. శారీరక శ్రమ తర్వాత కండరాలు ఎలా పునరుద్ధరించబడతాయో, అలాగే మెదడుకూ విశ్రాంతి అవసరం. సరైన విశ్రాంతి తీసుకున్నప్పుడు, మనుషులు మరింత ఉత్సాహంతో, స్పష్టమైన ఆలోచనలతో, మెరుగైన పనితీరుతో తిరిగి పనిలోకి ప్రవేశిస్తారని నిపుణులు సూచిస్తున్నారు.

# చెమటతో ఇబ్బంది పడుతున్నారా? ఈ ముఖ్య విషయాలు తెలుసుకోండి



చెమట పట్టడం మన శరీరానికి సహజమైన ప్రక్రియ. వ్యాయామం చేసినప్పుడు లేదా వేడి వాతావరణంలో ఉన్నప్పుడు చెమట పట్టడం సాధారణమే. ఇది శరీర ఉష్ణోగ్రతను నియంత్రించే సహజ విధానం. అయితే కొంతమందికి అధికంగా చెమట పడుతుంది. దీనిని నిర్లక్ష్యం చేయకూడదు. కొన్ని సందర్భాల్లో ఇది అంతర్గత ఆరోగ్య సమస్యకు సంకేతం కావచ్చు.

శరీరంలో ఉన్న చెమట గ్రంథులు శరీరాన్ని చల్లగా ఉంచేందుకు చెమటను ఉత్పత్తి చేస్తాయి. కానీ కొన్ని పరిస్థితుల్లో ఈ ప్రక్రియ ఎక్కువగా జరుగుతుంది. కొన్ని ఆరోగ్య సమస్యలు లేదా మందుల వల్ల చెమట ఎక్కువగా పట్టవచ్చు. ఇలాంటి పరిస్థితిని 'హైపర్ హైడ్రోసిస్' అంటారు. వేడి లేకపోయినా లేదా శారీరక శ్రమ లేకపోయినా అధికంగా చెమట పడుతుంది. ఇది రోజువారీ పనులకు ఇబ్బంది కలిగించడమే కాకుండా అసౌకర్యంగానూ అనిపిస్తుంది.

### అధిక చెమటకు కారణాలు:

హార్మోన్ల మార్పులు
ఒత్తిడి, ఆందోళన
కొన్ని మందుల ప్రభావం
థైరాయిడ్ వంటి ఆరోగ్య సమస్యలు
జన్యుపరమైన కారణాలు

చెమటను తగ్గించడానికి మొదట ప్రత్యేక లోషన్లు లేదా యాంటీ-పర్స్పిరెంట్లు ఉపయోగిస్తారు. అవి పనిచేయకపోతే మందులు లేదా ఇతర చికిత్సలు అవసరం కావచ్చు. తీవ్రమైన సందర్భాల్లో శస్త్రచికిత్స కూడా సూచించవచ్చు.

### చెమట పడటం వల్ల లాభాలు కూడా ఉన్నాయి:

చర్మంలోకి చొచ్చుకుపోయిన కాలుష్యం, విషపదార్థాలను చెమట బయటకు పంపుతుంది. చెమట పట్టడం వల్ల చర్మ రంధ్రాలు తెరుచుకుని, వాటిలో ఉండే మలినాలు, బ్యాక్టీరియా బయటకు పోయి చర్మం లోపలి నుంచి శుభ్రమవుతుంది. ఇది చర్మానికి తేమను కూడా అందిస్తుంది. రక్తప్రసరణ మెరుగై శరీరానికి ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. చెమట పట్టడం సహజమైనదే అయినప్పటికీ, అధికంగా చెమట పడితే దాన్ని నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం మంచిది.

# గర్భధారణ సమయంలో మహిళలు ఒత్తిడిని తగ్గించుకోవాలి.. లేదంటే శిశువుకు ఇబ్బందే..



గర్భధారణ మహిళల జీవితంలో ఆనందకరమైన దశ అయినప్పటికీ, ఇది భావోద్వేగ, శారీరక ఒత్తిడికి కూడా కారణమవుతుంది. గర్భధారణ సమయంలో దీర్ఘకాలిక ఒత్తిడి నిద్రలేమి, అధిక రక్తపోటు, ఆకలి తగ్గడం వంటి సమస్యలకు దారితీస్తుంది. అంతేకాకుండా ముందస్తు ప్రసవం (ప్రి-టర్మ్ బర్త్), తక్కువ బరువుతో శిశువు జననం వంటి ప్రమాదాలకూ కారణమవుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందువల్ల ఒత్తిడిని నియంత్రించడం ప్రీనేటల్ కేర్‌లో కీలక భాగంగా మారింది. గర్భధారణ అనేది శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా మార్పులు తీసుకువచ్చే ప్రయాణం. హార్మోన్ల మార్పులు, శరీర అసౌకర్యం, శిశువు ఆరోగ్యం, ప్రసవంపై ఆందోళనలు వంటివి ఒత్తిడికి కారణమవుతాయి. కొంతమేర ఒత్తిడి సహజమైనదే అయినప్పటికీ అధిక ఒత్తిడి తల్లి, గర్భంలోని శిశువుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

### నాణ్యమైన నిద్ర ఉండాలి..

దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల కార్టిసోల్, అడ్రినలిన్ వంటి హార్మోన్లు అధికంగా విడుదలవుతాయి. ఇవి తల్లి ఆరోగ్యంపై ప్రభావం చూపడంతో పాటు పరోక్షంగా శిశువు అభివృద్ధిని కూడా ప్రభావితం చేస్తాయి. నిద్రలేమి, రక్తపోటు పెరగడం, ఆకలి తగ్గడం వంటి సమస్యలు కలుగుతాయి. అలసట పెరిగే కొద్దీ ఒత్తిడి కూడా పెరుగుతుంది. కనుక నిద్రకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు సూచిస్తున్నారు. రోజుకు కనీసం 7 నుంచి 9 గంటల నాణ్యమైన నిద్ర అవసరం. అవసరమైతే పగటిపూట చిన్నపాటి విశ్రాంతి తీసుకోవడం మంచిది. నిద్రకు ముందు రిలాక్సేషన్ అలవాట్లు ఏర్పరుచుకోవడం చక్కటి ఉపశమనాన్ని ఇస్తుంది. అలాగే సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటే మూడ్ కూడా స్థిరంగా ఉంటుంది.

### శారీరకంగా చురుగ్గా ఉండాలి..

చిన్న పరిమాణాల్లో తరచుగా ప్రోటీన్లు, ధాన్యాలు, పండ్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల అలసట, చిరాకు తగ్గి ఒత్తిడి తగ్గుతుంది. తగిన విశ్రాంతి తీసుకుంటూనే శారీరకంగా చురుకుగా ఉండాలి. డాక్టర్ సూచించిన వ్యాయామాలతో పాటు నడక, ప్రీనేటల్ యోగా, స్ట్రెచింగ్ వంటి కార్యకలాపాలు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఇవి ఎండోర్ఫిన్స్ విడుదలకు సహాయపడి మానసిక ప్రశాంతతను పెంచుతాయి. వీటితో పాటు భర్త, కుటుంబ సభ్యులు లేదా వైద్యులతో మాట్లాడటం ద్వారా భావోద్వేగ ఒత్తిడి తగ్గుతుంది. ప్రసవం, శరీర మార్పులు, శిశువు సంరక్షణపై ఉన్న భయాలను వారితో పంచుకోవడం మంచిది. ఎక్కువ ఆందోళన, నిరాశ, నిద్రలేమి వంటి లక్షణాలు ఉంటే వాటిని నిర్లక్ష్యం చేయకూడదు. అవసరమైతే వైద్యులను సంప్రదించి సలహా తీసుకోవడం మంచిది. ఇది తల్లి, శిశువు ఇద్దరి ఆరోగ్యానికి ఉపయోగకరం. శాంతంగా ఉన్న తల్లి ఆరోగ్యకరమైన గర్భధారణకు సూచిక. అందువల్ల గర్భిణీలు విశ్రాంతికి సమయం కేటాయిస్తూ, తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం అత్యంత ముఖ్యమని వైద్యులు తెలియజేస్తున్నారు.

# వేసవిలో చెమటకాయలు వేధిస్తున్నాయా? ఈ ఇంటి చిట్కాలతో చెక్ పెట్టండి!




ఎండలు పెరుగుతున్న కొద్దీ చాలామందిని వేధించే ప్రధాన సమస్య చెమటకాయలు. చర్మ రంధ్రాలు పూడుకుపోయి చెమట బయటకు రానప్పుడు చెమటకాయలు ఏర్పడతాయి. పెద్దలతో పాటు పిల్లల్నీ ఈ సమస్య తెగ ఇబ్బంది పెడుతుంది. చెమటకాయల వల్ల కలిగే దురద, మంట నుంచి ఉపశమనం పొందడానికి ఈ కింది చిట్కాలు పాటిస్తే సరిపోతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

### చెమటకాయల నివరాణకు ఇంటి చిట్కాలు:


గంధం పొడిలో కొద్దిగా పన్నీరు కలిపి ప్యాక్‌లా వేసుకోవాలి. ఇది చర్మాన్ని చల్లబరిచి, మంటను తగ్గిస్తుంది. ముల్తానా మట్టిలో నీళ్లు కలిపి చెమటకాయలు ఉన్నచోట రాసి, ఆరిన తర్వాత చల్లని నీటితో కడిగేయాలి. ఇది చర్మంపై ఉన్న అధిక నూనెను, మురికిని తొలగిస్తుంది. కలబంద జెల్‌ను నేరుగా చెమటకాయలపై రాస్తే అందులోని యాంటీసెప్టిక్ గుణాలు చర్మాన్ని త్వరగా కోలుకునేలా చేస్తాయి. వేప ఆకులను నీటిలో మరిగించి, ఆ నీటితో స్నానం చేయడం వల్ల ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. లేదా వేపాకుల పేస్ట్‌ను కూడా చెమటకాయలు ఉన్న చోట రాసుకుంటే తగ్గుతాయి. ఒక కాటన్ క్లాత్ లో ఐస్ ముక్కలను చుట్టి చెమటకాయల మీద మెల్లగా రుద్దాలి. ఇది తక్షణ ఉపశమనాన్ని ఇస్తుంది.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు:


వేసవిలో సాధ్యమైనంత వరకు వదులుగా ఉండే కాటన్ దుస్తులనే ధరించాలి. సింథటిక్ దుస్తులు చెమటను పీల్చుకోలేవు, దీనివల్ల సమస్య మరింత పెరుగుతుంది. రోజుకు రెండుసార్లు చల్లని నీటితో స్నానం చేయడం చాలా మంచిది. యాంటీ బ్యాక్టీరియల్ సోప్స్ వాడటం వల్ల చర్మం శుభ్రంగా ఉంటుంది. శరీరంలో వేడి తగ్గడానికి ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటివి తీసుకోవాలి. కెమికల్స్ ఎక్కువగా ఉండే సెంటెడ్ పౌడర్లకు దూరంగా ఉండాలి. అవసరమైతే డాక్టర్ సూచించిన మెడికేటెడ్ కూలింగ్ పౌడర్స్‌ను వాడొచ్చు.

## మామ సినిమాకు అల్లుడు క్లాప్

- బాలకృష్ణ 112వ చిత్రానికి లోకేశ్ కెమెరా ఆన్



రాజధాని అమరావతిలో నందమూరి నటసింహం బాలకృష్ణ 112వ చిత్రం గ్రాండ్‌గా లాంచ్ అయ్యింది. సినిమా ప్రారంభోత్సవ వేడుకలకు మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేష్ ముఖ్య అతిథులుగా హాజరై.. క్లాప్ కొట్టి, కెమెరా స్విచ్‌ఆన్ చేశారు. ఈ సందర్భంగా హీరో బాలకృష్ణ మాట్లాడుతూ.. సినిమా ఓపెనింగ్ కోసం వచ్చిన మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సినిమా మొదటి షాట్‌ను డైరెక్ట్ చేసిన నందమూరి తేజస్వినికి ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పెద్ద సినిమాకి క్లాప్ కొట్టి 20 సంవత్సరాలు అయ్యిందన్నారు. ఏపీలో సినీ పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని అన్నారు. పర్యాటక రంగం, సినీ పరిశ్రమ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని బాలయ్య తెలిపారు. సినీ ఇండస్ట్రీని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. సినిమాతో పాటు థియేటర్ ఎకనామిని ప్రోత్సహిస్తామన్నారు. ఎఐ టెక్నాలజీతో సినిమా పరిశ్రమను మరింత ఉన్నతికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సినిమాలు అమరావతి నుంచే ప్రారంభం కావాలని కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. సినీ పరిశ్రమకు సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. స్టూడియోలు, రికార్డింగ్ థియేటర్లకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. త్వరలో సినీ పరిశ్రమకు చెందిన స్టూడియో కూడా రావాలని కందుల దుర్గేష్ ఆకాంక్షించారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు బాలయ్య బాబు కోసం ఒక సినిమా రాశానని దర్శకుడు కొరటాల శివ అన్నారు. రైటర్‌గా కూడా ఒక సినిమా రాసినట్లు చెప్పారు. ఇప్పుడు బాలయ్య బాబుకు దర్శకత్వం వహించడం తన అదృష్టమని శివ చెప్పుకొచ్చారు.



## సందీప్ కిషన్ సూపర్ సుబ్బు



టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటించిన సరికొత్త వెబ్ సిరీస్ 'సూపర్ సుబ్బు'. నెట్‌ఫ్లిక్స్ సంస్థ అందిస్తున్న మొట్టమొదటి ఒరిజినల్ తెలుగు సిరీస్ ఇదే కావడం విశేషం. తాజాగా ఈ సిరీస్ అఫీషియల్ ట్రైలర్‌ను నెట్‌ఫ్లిక్స్ ఇండియా విడుదల చేసింది. 'డీజే టిల్లు' ఫేమ్ డైరెక్టర్ మల్లిక్ రామ్ ఈ కామెడీ డ్రామా సిరీస్‌ను తెరకెక్కించారు. బాలీవుడ్ 'లిటిల్ థింగ్స్' ఫేమ్ మిథిలా పాల్కర్ ఈ సిరీస్‌లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఒక అమాయక యువకుడు, అత్యంత సంప్రదాయ గ్రామం, అసాధ్యమైన ఓ ఉద్యోగం అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో ఈ సిరీస్ వస్తోంది. సుబ్రమణ్యం చిలుకూరి రావు అలియాస్ సుబ్బు అనే ఒక అమాయక పల్లెటూరి యువకుడికి ఎవరూ వెళ్లడానికి ఇష్టపడని 'మాకీపూర్' అనే వింత ఊరికి పోస్టింగ్ వస్తుంది. తన తండ్రి కుకటేశ్వరరావు ముందు పరువు నిలబెట్టుకోవాలని ఆ ఊరిలో అడుగుపెట్టిన సుబ్బుకి అక్కడ ఊహించని షాక్ తగులుతుంది. దేశంలోనే అత్యధిక సంతానోత్పత్తి రేటు ఉండి, జనాభా నియంత్రణ లేని ఆ ఊరి జనాలకి మనోడు సెక్స్ ఎడ్యుకేషన్ ఆఫీసర్‌గా పాఠాలు చెప్పాల్సి వస్తుంది. ఒకవైపు జాబ్ టెన్షన్స్, లవ్ ప్రాబ్లమ్స్, ఇంకోవైపు ఊరి జనాల అపార్థాల మధ్య సుబ్బు పడే ఇబ్బందులు, క్రియేట్ చేసే కామెడీతో ఈ ట్రైలర్ నవ్వులు పూయించింది. మిథిలా పాల్కర్ ఒక క్రేజీ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా, నటి అవ్వాలని కలలుకనే పాత్రలో కనిపించనుంది. వీరితో పాటు కామెడీ కింగ్ బ్రహ్మానందం, వర్సటైల్ యాక్టర్ మురళీ శర్మ, గెటప్ శ్రీను, జీవన్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, భరత్ లక్ష్మీపతి ఈ సిరీస్‌ను నిర్మించారు. మల్లిక్ రామ్, రమేష్ ఎలిగేటి, శివాని ధోబాల్ సంయుక్తంగా దీనికి కథను అందించారు. ఈ అవుట్ అండ్ అవుట్ హిలేరియస్ ఎంటర్‌టైనర్ వెబ్ సిరీస్ జులై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో స్ట్రీమింగ్ కానుంది.

## కలెక్షన్లు రాబడుతున్న మా ఇంటి బంగారం

### ఆరు రోజుల్లో రూ.55.71 కోట్ల గ్రాస్ వసూళ్లు



స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ దగ్గర మంచి ప్రదర్శన కనబరుస్తుంది. విడుదలైన తొలి వారంలోనే ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను నమోదు చేస్తూ సమంత కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ సాధించిన సినిమాల్లో ఒకటిగా నిలిచింది. యాక్షన్, ఫ్యామిలీ ఎమోషన్స్, థ్రిల్లింగ్ అంశాల కలయికతో రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటూ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'మా ఇంటి బంగారం' చిత్రం ప్రపంచవ్యాప్తంగా ఆరు రోజుల్లో రూ.55.71 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించింది. భారతదేశంలో రూ.33.20 కోట్ల నెట్ కలెక్షన్లు నమోదు చేయగా, దేశీయ గ్రాస్ వసూళ్లు రూ.38.36 కోట్లకు చేరుకున్నాయి.

విడుదలైన ఆరో రోజున కూడా సినిమా మంచి వసూళ్లు సాధించడంతో బాక్సాఫీస్ వద్ద ఈ చిత్ర జోరు కొనసాగుతోంది. విదేశీ మార్కెట్లలో కూడా ఈ సినిమాకు మంచి ఆదరణ లభిస్తోంది. ఇప్పటివరకు ఓవర్సీస్‌లో ఈ చిత్రం రూ.17.35 కోట్ల గ్రాస్ కలెక్షన్లు నమోదు చేసినట్లు ట్రేడ్ రిపోర్టులు సూచిస్తున్నాయి. ఆరో రోజున ఒక్క రోజులోనే విదేశీ మార్కెట్ల నుంచి రూ.కోటికి పైగా వసూళ్లు రావడం విశేషం. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూకే మార్కెట్లలో సినిమాకు మంచి స్పందన లభిస్తున్నట్లు తెలుస్తోంది. చాలా కాలం తర్వాత సమంత ప్రధాన పాత్రలో వచ్చిన ఈ సినిమా యాక్షన్, ఫ్యామిలీ, థ్రిల్లర్ అంశాలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. సినిమాలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, శ్రీముఖి, శ్రీలక్ష్మి, శ్రీనివాస్ గవిరెడ్డి, మంజుషా తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

## ధర్మన్‌లో రజనీ డాక్టర్ అవతారం



అగ్ర కథానాయకుడు సూపర్‌స్టార్ రజనీకాంత్ తన 173వ సినిమాతో మరోసారి అభిమానులను అలరించేందుకు సిద్ధమయ్యారు. 'ధర్మన్' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తలైవా 'ది డెడ్లీ డాక్టర్' అవతారంలో కనిపించనున్నారు. న్యాయాన్ని గెలిపించే ఓ వైద్యుడిగా రజనీకాంత్ పాత్ర చాలా వైవిధ్యంగా, పవర్‌ఫుల్‌గా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. 'డ్రాగన్' ఫేమ్ అశ్వత్ మారిముత్తు ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా, ఉలగనాయగన్ కమల్ హాసన్ తన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రజనీ, కమల్ కాంబినేషన్‌లో చాలా ఏళ్ల తర్వాత సినిమా రావడం విశేషం. ఈ చిత్రంలో సిమ్రన్, రాశీ ఖన్నా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా చిత్రబృందం 'ది ఓజీ స్వాగ్' అనే క్యాప్షన్‌తో టైటిల్ పోస్టర్ మేకింగ్ వీడియోను విడుదల చేసింది. ఆ వీడియోలో రజనీకాంత్ స్టైల్, స్క్రీన్ ప్రెజెన్స్ మరోసారి అభిమానులను ఫిదా చేస్తున్నాయి. డాక్టర్ కోట్‌లో స్టెతస్కోప్‌తో, సీరియస్ లుక్‌లో తలైవా లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. న్యాయం కోసం ఏ స్థాయికైనా వెళ్లే డాక్టర్‌గా రజనీకాంత్ ఈ సినిమాలో కనిపిస్తారని టాక్. అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న 'ధర్మన్' త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుంది. రజనీ మార్క్ యాక్షన్, డైలాగ్స్, ఎమోషన్‌తో పాటు సామాజిక అంశాలను టచ్ చేసే కథతో ఈ సినిమా రూపొందుతోందని తెలుస్తోంది.

## ఓజి -2 సీక్వెల్‌కు పవన్ రెడీ

### సోషల్ మీడియాలో స్పెషల్ వీడియో విడుదల




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా, యంగ్ డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ' బాక్సాఫీస్ దగ్గర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఓజీ 2' రానున్న విషయం ఇప్పటికే అధికారికంగా ప్రకటించగా, తాజాగా ఆ సినిమా పనులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం గురువారం ఒక స్పెషల్ వీడియోను సోషల్ మీడియా వేదికగా విడుదల చేసింది. ఈ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. 'గంభీర కథ సిద్ధమవుతోంది. తుపాను రావడానికి ముందు నిశ్శబ్దం ఉంటుంది' అనే పవర్‌ఫుల్ క్యాప్షన్‌తో ఈ అప్‌డేట్ ఇచ్చారు. విడుదలైన వీడియోలో డైరెక్టర్ సుజీత్‌తో కలిసి పవన్ కళ్యాణ్ స్క్రిప్ట్ గురించి చర్చిస్తున్న విజువల్స్ ఉన్నాయి. చివర్లో పవన్ కళ్యాణ్ 'నేను రెడీ' అని చెప్పడం నెటిజన్లను, మెగా అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. దీంతో 'ఓజీ 2' షూటింగ్ త్వరలోనే సెట్స్ మీదకు వెళ్లనుందని స్పష్టమవుతోంది. మొదటి భాగానికి సంగీత దర్శకుడిగా పని చేసిన థమన్ ఎస్ ఈ సీక్వెల్‌కు కూడా మ్యూజిక్ అందించనున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య నిర్మిస్తున్న ఈ భారీ చిత్రంపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. 'ఓజీ' మొదటి భాగంలో చూపించిన పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ వరల్డ్‌ను ఈ సీక్వెల్‌లో మరింత పెద్ద స్థాయిలో, కొత్త కోణంలో చూపించనున్నారని టాక్. ప్రస్తుతం రాజకీయాలతో బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్, 'ఓజీ 2' కోసం డేట్స్ కేటాయించడంతో అభిమానుల్లో ఫుల్ జోష్ నెలకొంది.

## నా బాడీ నాష్టం అంటే.. వాడి కళ్లు వాడి ఇష్టం


- స్త్రీల వేషధారణపై పరిమితులు ఉండాలన్న సునీత



ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ సునీత ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మహిళల వస్త్రధారణ, సినిమా సామాజిక బాధ్యత, మరియు సమాజంలో స్వేచ్ఛ అనే అంశాలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చకు దారితీశాయి. సమాజంలో జరిగే విషయాలనే సినిమాలో చూపిస్తున్నామని మేకర్స్ చెప్పే సమాధానాన్ని సునీత తప్పుబట్టారు. కమర్షియల్ సినిమా అయినా, ఎలాంటి సినిమా అయినా సమాజం పట్ల కొంత బాధ్యత కలిగి ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. అయితే సమాజంలో సినిమాని తిడితే, సినిమాలో సమాజాన్ని తిడుతున్నారు, సమాజం అలా ఉంది కాబట్టే తాము ఇలా సినిమా తీశామని మేకర్స్ చెబుతున్నారని సునీత పేర్కొన్నారు. ఇక ఇటీవల కాలంలో బాగా వినిపిస్తున్న మై బాడీ మై రైట్ అనే స్లోగన్‌పై సునీత ప్రాక్టికల్ కోణంలో మాట్లాడారు. అమ్మాయిలు నా బాడీ నా ఇష్టం అని తమకు నచ్చిన బట్టలు వేసుకున్నప్పుడు, అవతలి వ్యక్తి చూసే చూపును కూడా వాడి కళ్ళు వాడి ఇష్టం అనాల్సి వస్తుందని, ఇందులో ఎవరినీ తప్పు పట్టలేమని అన్నారు. ఎవరి ఇష్టం వారిదని ఆమె స్పష్టం చేశారు. అయితే బట్టల పరిధిని పెంచుకోవడాన్ని లేదా తగ్గించుకోవడాన్ని తన దృష్టిలో అసలైన స్వేచ్ఛ అనరని సునీత తెలిపారు. చుట్టూ ఉన్న పరిసరాలు ఎంతవరకు సురక్షితంగా ఉన్నాయో చూసుకోవడం కూడా ముఖ్యమని పేర్కొన్నారు. కేవలం బట్టలు లేదా సిగరెట్లు తాగడం ఈక్వాలిటీ కాదని, సమాజంలో లేదా ఒక ఇంట్లో ఒక మహిళ తన అభిప్రాయాన్ని చెప్తే, దానికి పురుషులు ఎంతవరకు విలువ ఇస్తున్నారు అనే దానిపై పోరాడాలని సునీత అభిప్రాయపడ్డారు. పెద్ది సినిమాలో జాన్వీ కపూర్ పాత్ర చిత్రీకరణపై కూడా సునీత పరోక్షంగా ప్రస్తావిస్తూ ఎవరి ఒపీనియన్ వాళ్లది. ఎస్ చెప్పాలన్నా, నో చెప్పాలన్నా మన ఇష్టమే. కేవలం సినిమా ఇండస్ట్రీలోనే కాదు, నేను జనరల్ గా సొసైటీలో ఉన్న అమ్మాయిల గురించి కూడా మాట్లాడుతున్నాను. ఇక్కడ ఒక గీత గీయాలంటే, ఫుల్ స్టాప్ పెట్టాలంటే బలవంతం ఏమీ లేదు అని సునీత తెలిపారు.

## వెండితెరపైకి వస్తోన్న మిర్జాపూర్

అత్యంత ప్రజాదరణ పొందిన క్రైమ్ డ్రామా వెబ్ సిరీస్ 'మిర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై అలరించడానికి సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో మూడు సీజన్ల పాటు ఓటీటీ ప్రేక్షకులను అలరించిన ఈ సిరీస్, ఇప్పుడు 'మిర్జాపూర్: ది మూవీ' పేరుతో భారీ ఫీచర్ ఫిల్మ్‌గా రాబోతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌లో పంకజ్ త్రిపాఠి కాలీన్ భయ్యాగా, అలీ ఫజల్ గుడ్డూ భయ్యాగా, దివ్యేందు మున్నా భయ్యాగా తమ ఐకానిక్ పాత్రల్లో మళ్లీ కనిపించి అభిమానులను అలరించారు. మరోవైపు ఈ చిత్రంలో రవి కిషన్, పంచాయత్ ఫేమ్ జితేంద్ర కుమార్ కీలక పాత్రల్లో ఎంట్రీ ఇస్తూ మరింత ఆసక్తిని పెంచుతున్నారు. రెండు నిమిషాల కంటే ఎక్కువ నిడివి ఉన్న ఈ టీజర్ పాత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ, మరింత భారీ యాక్షన్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో సాగింది. ఈ సారి కేవలం మిర్జాపూర్ గద్దె కోసమే కాకుండా అధికారం కోసం కూడా యుద్ధం జరగబోతోందని టీజర్‌తో స్పష్టమవుతుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. కేవలం హిందీలోనే కాకుండా ఇతర భాషలో కూడా థియేటర్లలో విడుదలరాబోతున్నట్లు తెలుస్తుంది.



# వన్డే ప్రపంచకప్ 2027లో రో-కో ఆడాలి




### సెలక్టర్లకు రవిచంద్రన్ అశ్విన్ సూచన

వన్డే ప్రపంచకప్ 2027లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడటంపై వస్తున్న పుకార్లకు రవిచంద్రన్ అశ్విన్ గట్టి కౌంటర్ ఇచ్చాడు. వీరిద్దరిపై పనిగట్టుకుని కొందరు నెగెటివ్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డాడు. తన వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం వచ్చే ప్రపంచకప్‌లో రో-కో కచ్చితంగా ఆడాలని స్పష్టం చేశాడు. అలాగే బీసీసీఐ సెలక్టర్లు కూడా వీరి భవితవ్యంపై ఇప్పుడే ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకుంటే.. ఎలాంటి గందరగోళం లేకుండా వారు పూర్తి నమ్మకంతో టోర్నీకి సిద్ధమవుతారని అశ్విన్ సూచించాడు.టీమిండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ , విరాట్ కోహ్లీ .. భవితవ్యంపై భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వన్డే ప్రపంచకప్ 2027లో ఆడటమే లక్ష్యంగా రోహిత్, కోహ్లీ అడుగులు వేస్తున్నారు. కానీ వారు ఈ మెగా టోర్నీలో ఆడతారా.. లేదా అనే అంశంపై బీసీసీఐ ఇప్పటివరకు స్పష్టత ఇవ్వడం లేదు. కొందరు.. రోకో ప్రపంచకప్ ఆడరని.. మరికొందరు ఆడాలని కామెంట్లు చేస్తున్నారు. ఇదే విషయంపై అశ్విన్ మాట్లాడాడు. వీరిపై సెలక్టర్లు వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించాడు.ఇటీవల కాలంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గురించి వస్తున్న వార్తలు బాలేవు. కొందరు పనిగట్టుకుని నెగెటివ్ ప్రచారం చేస్తున్నారు. అసలు ఎక్కడ నుంచి ఇలాంటి నెగెటివ్ ప్రచారం వస్తోందో తెలియడం లేదు. కొందరు మాత్రం ఈ ఇద్దరు ప్రపంచ కప్‌లో ఆడకూడదని గట్టిగా కోరుకుంటున్నారు. ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారో మాత్రం అర్థం కావడంలేదు. కొందరేమో వారు ఆడకపోవచ్చని అనుమానాలు వచ్చేలా మాట్లాడుతున్నారు. మరికొందరు మాత్రం రో-కో ఉంటేనే బాగుంటుందంటారు. నా వ్యక్తిగత అభిప్రాయం ప్రకారం వన్డే ప్రపంచకప్ 2027లో రోహిత్, కోహ్లీ తప్పకుండా ఆడాలి" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఇదే సమయంలో అశ్విన్.. భారత సెలక్టర్లకు కీలక సూచన చేశాడు. "దక్షిణాఫ్రికా వేదికగా జరిగే వన్డే ప్రపంచ కప్‌లో కోహ్లీ, రోహిత్ ఉండాలని మీరు కోరుకుంటే.. ఇప్పుడే నిర్ణయం తీసుకోండి. అలా చేయడం వల్ల టోర్నీ నాటికి వారు పూర్తి సన్నద్ధతతో, విశ్వాసంతో ఉంటారు. ఒకవేళ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోతే.. మున్ముందు ఈ అంశం మరింత సంక్లిష్టంగా మారుతుంది.




గందరగోళానికి దారి తీస్తుంది" అని రవిచంద్రన్ అశ్విన్ తన మనసులోని మాటను బయటపెట్టాడు. రోహిత్, కోహ్లీ టెస్ట్, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నారు. రోహిత్ ఇటీవల అఫ్ఘాన్‌తో వన్డే సిరీస్‌లో రాణించాడు. గాయం కారణంగా కోహ్లీ ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో వీరిద్దరూ పాల్గొనే అవకాశం ఉంది.

# 15మందితో టీమిండియా

# వన్డే ప్రపంచకప్ 2027 స్క్వాడ్..

వన్డే ప్రపంచకప్ 2027 లక్ష్యంగా టీమిండియా ఇప్పటి నుంచే సరికొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. త్వరలో ఇంగ్లాండ్‌తో జరగబోయే వన్డే సిరీస్ కోసం ప్రకటించిన జట్టును పరిశీలిస్తే.. రాబోయే ప్రపంచకప్‌లో భారత్ తరపున బరిలోకి దిగే 15 మంది ఆటగాళ్లు ఎవరనేదానిపై ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, సెలెక్టర్లు ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇంగ్లాండ్ పర్యటన కోసం బలిష్టమైన వన్డే జట్టును ప్రకటించింది. జూలై 19 నుంచి ప్రారంభం కానున్న ఈ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కేవలం ద్వైపాక్షిక సమరం మాత్రమే కాదు.. రాబోయే 2027 వన్డే ప్రపంచకప్‌నకు పునాది అని విశ్లేషకులు భావిస్తున్నారు. జట్టులో సీనియర్ల పునరాగమనం, కుర్రాళ్ళకు దక్కిన అవకాశాలను బట్టి చూస్తే, రాబోయే నాలుగేళ్ల పాటు వన్డేల్లో కొనసాగే కోర్ టీమ్ ఇదేనని స్పష్టమవుతోంది.






ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ పర్యవేక్షణలో సెలెక్షన్ కమిటీ దీర్ఘకాలిక ప్రణాళికతోనే ఈ అడుగులు వేసింది. ఈ సిరీస్ కోసం భారత జట్టులోకి రన్‌మెషీన్ విరాట్ కోహ్లీ తిరిగి వచ్చారు. అయితే, అఫ్ఘానిస్తాన్‌తో జరిగిన వన్డేలో కేవలం 86 బంతుల్లో 110 పరుగులతో అద్భుత శతకం బాదిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు ఈ జట్టులో చోటు దక్కకపోవడం గమనార్హం. జైస్వాల్ స్థానంలోనే కోహ్లీ జట్టులోకి వచ్చారు. వీరితో పాటు స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ కూడా జట్టులోకి తిరిగొచ్చారు. అఫ్గాన్ సిరీస్‌లో ఆకట్టుకున్న ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబే వంటి యువ ఆటగాళ్లను సీనియర్ల కోసం పక్కన పెట్టక తప్పలేదు. మెగా టోర్నీల అనుభవం దృష్ట్యా పెద్ద లీగ్‌లలో సీనియర్లకే గంభీర్ మొగ్గు చూపుతారని దీన్నిబట్టి అర్థమవుతోంది. ప్రస్తుత ఇంగ్లాండ్ సిరీస్‌కు తెలుగు ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి ఎంపికయ్యాడు. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పూర్తి ఫిట్‌నెస్‌తో లేకపోవడం వల్లే నితీష్‌కు ఈ అవకాశం దక్కింది. అయితే, ప్రపంచకప్ 2027 నాటికి హార్దిక్ పాండ్యా గనుక పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తే జట్టులో ఆయనకే మొదటి ప్రాధాన్యత ఉంటుంది. ఐసీసీ టోర్నమెంట్‌లలో హార్దిక్ ట్రాక్ రికార్డ్ అద్భుతంగా ఉన్నందున, ఆయన జట్టులో ఉండటం ఖాయం. ఒకవేళ హార్దిక్ అందుబాటులో లేకపోతే బ్యాకప్ ఆల్‌రౌండర్‌గా నితీష్ రెడ్డి రేసులో నిలుస్తారు.

**ప్రపంచకప్ 2027 రేసులో ఉండే ఆ 15 మంది అంచనా జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, జస్ప్రీత్ బుమ్రా, గుర్నూర్ బ్రార్, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా.**

# సుదీర్ఘ విరామం తర్వాత మైదానంలోకి నెయ్‌మర్

స్కాట్లాండ్‌పై 3-0 తేడాతో బ్రెజిల్ ఘనవిజయం

2026 ఫిఫా ప్రపంచకప్‌లో ఫుట్‌బాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. బ్రెజిల్ దిగ్గజ ఆటగాడు నెయ్‌మర్ జూనియర్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టాడు. 2026 ఫిఫా ప్రపంచకప్‌లో భాగంగా స్కాట్లాండ్‌తో జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో నెయ్‌మర్ బరిలోకి దిగాడు. ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై 3-0 తేడాతో బ్రెజిల్ ఘనవిజయం సాధించి, టోర్నీలో నాకౌట్ దశకు దూసుకెళ్లింది. నెయ్‌మర్ 2023 అక్టోబర్ తర్వాత బ్రెజిల్ తరపున మళ్లీ ఇప్పుడే మైదానంలోకి వచ్చాడు. ఆ సమయంలో ఉరుగ్వేతో జరిగిన ప్రపంచకప్ క్వాలిఫైయర్ మ్యాచ్‌లో అతనికి మోకాలికి తీవ్రమైన గాయం అయింది. ఆ తర్వాత ఇటీవలే పిక్క గాయం కూడా వేధించింది. దీంతో అతను దాదాపు రెండేళ్లపాటు ఆటకు పూర్తిగా దూరమయ్యాడు. ఇటీవల ఫిట్‌నెస్ సాధించిన నెయ్‌మార్ స్కాట్లాండ్‌తో మ్యాచ్‌లో 76వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మథ్యూస్ కున్హా స్థానంలో మైదానంలోకి అడుగుపెట్టాడు. ఆ సమయంలో అభిమానుల కరతాళ ధ్వనులు ఈ మ్యాచ్‌కే హైలైట్. ఈ మ్యాచ్‌లో ఆడటం ద్వారా నెయ్‌మర్ తన అంతర్జాతీయ కెరీర్‌లో ఒక మైలురాయిని అందుకున్నాడు. ఇది అతనికి నాలుగో ఫిఫా ప్రపంచకప్ టోర్నమెంట్. అంతకుముందు అతను 2014, 2018, 2022 ప్రపంచకప్ ఎడిషన్లలో ఆడాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్రెజిల్ మొదటి నుంచీ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బ్రెజిల్ స్టార్ ప్లేయర్ వినీషియస్ జూనియర్ ఫస్ట్ హాఫ్‌లోనే రెండు సూపర్ గోల్స్‌తో మెరిశాడు. మ్యాచ్ ప్రారంభమైన 7వ నిమిషంలోనే జట్టుకు తొలి గోల్ అందించాడు. హాఫ్-టైమ్‌కు కొద్ది నిమిషాల ముందు హెడర్ ద్వారా రెండో గోల్ చేసి బ్రెజిల్‌ను 2-0తో ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత సెకండ్ హాఫ్‌లో మథ్యూస్ కున్హా మూడో గోల్ సాధించడంతో బ్రెజిల్ 3-0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. ఈ రెండు గోల్స్‌తో వినీషియస్ రికార్డును సొంతం చేసుకున్నాడు. ప్రపంచకప్‌లో బ్రెజిల్ ఆడిన మొదటి మూడు మ్యాచ్‌ల్లోనూ వరుసగా గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. గత 24 ఏళ్లలో ఏ బ్రెజిల్ ఆటగాడికీ ఇది సాధ్యం కాలేదు. దీనితో అతను 2002 ప్రపంచకప్‌లో ఈ ఘనత సాధించిన దిగ్గజాలు రొనాల్డో నజారియో, రివాల్డోల రికార్డును సమం చేశాడు. స్కాట్లాండ్‌పై విజయంతో బ్రెజిల్ జట్టు గ్రూప్-సిలో మొత్తం 7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి నాకౌట్ (సూపర్-16) దశకు అర్హత సాధించింది. ఇదే గ్రూప్ నుంచి మొరాకో జట్టు కూడా నాకౌట్‌కు చేరింది. ఫిఫా ప్రపంచకప్ 2026లో గ్రూప్-బి చివరి లీగ్ మ్యాచ్‌లో ఉత్కంఠభరిత పోరు సాగింది. వ్యాంకోవర్ వేదికగా జరిగిన ఈ హోరాహోరీ సమరంలో స్విట్జర్లాండ్ 2-1 తేడాతో కెనడాపై ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో స్విట్జర్లాండ్ గ్రూప్ టాపర్‌గా నిలిచింది. అయితే ఓటమి పాలైనప్పటికీ కెనడా జట్టు తమ ఫుట్‌బాల్ చరిత్రలోనే తొలిసారిగా ప్రపంచకప్ నాకౌట్ దశకు అర్హత సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. మ్యాచ్ ఆరంభం నుంచి ఇరు జట్లు ఢీ అంటే ఢీ అన్నట్లుగా ఆడాయి. కెనడా డిఫెండర్లు, స్విస్ ఆటగాళ్లు హోరాహోరీగా తలపడటంతో మొదటి హాఫ్ ముగిసే సమయానికి ఇరు జట్లు ఎలాంటి గోల్స్ సాంధించలేకపోయాయి. సెకండ్ హాఫ్ ప్రారంభమైన వెంటనే స్విట్జర్లాండ్ వ్యూహాన్ని మార్చింది. కేవలం ఒక్క నిమిషంలోనే స్విస్ ఆటగాడు రూబెన్ వర్గాస్ అద్భుతమైన ఫీల్డ్ మూవ్‌ను గోల్‌గా మలిచి జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు.

## అక్షితా రాజ్‌తో ఆకాశ్ దీప్ వివాహం



భారత పేస్ బౌలర్ ఆకాశ్ దీప్ ఇటీవల పెళ్లి చేసుకున్నాడు. తన పెళ్లికి సంబంధించిన వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. అయితే పెళ్లిక హాజరైన ఓ అతిథి రోహిత్, కోహ్లి, ధోనీని ఎందుకు పిలవలేదు అంటూ అడగ్గా.. ఆకాశ్ దీప్ చమత్కారంగా సమాధానమిచ్చాడు. వారణాసికి వాళ్లు వచ్చి ఉంటే పెళ్లి ఎవరైనా జరిగనిచ్చేవారా? అంటూ ఫన్నీగా చెప్పాడు. ప్రస్తుతం గాయాల భారిన పడ్డ ఆకాశ్ దీప్ జట్టులో చోటు కోల్పోయాడు.టీమిండియా పేస్ బౌలర్ ఆకాశ్ దీప్ ఇటీవల వారణాసిలో అంగరంగ వైభవంగా అక్షితా రాజ్‌ను వివాహం చేసుకున్నాడు. తన పెళ్లి వేడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అభిమానులు, టీమిండియా ఫ్యాన్స్ అందరూ ఆకాశ్‌కు కామెంట్స్ రూపంలో శుభాకాంక్షలు తెలిపారు. అయితే, ఈ వివాహానికి హాజరైన ఓ అతిథి ఆకాశ్ దీప్‌ను ఓ ఆసక్తికర ప్రశ్న అడగ్గా, అంతకంటే ఇంట్రెస్టింగ్ ఆన్సర్ ఇచ్చాడు ఆకాశ్ దీప్.విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ, ఎంఎస్ ధోనీని వివాహానికి ఎందుకు ఆహ్వానించలేదంటూ ఒక అతిథిని ఆకాశ్ దీప్‌ను ప్రశ్నించాడు. దానికి ఆకాశ్ దీప్ సరదాగా స్పందిస్తూ వాళ్లు వస్తే ఇక్కడ వారణాసిలో పెళ్లి జరగనిస్తారా? అంటూ ఫన్నీగా జవాబిచ్చాడు. ధోనీ, విరాట్, రోహిత్ వంటి స్టార్ క్రికెటర్లు పెళ్లికి హాజరైతే భారీ సంఖ్యలో అభిమానులు తరలివస్తారు.. అప్పుడు పెళ్లి వేడుక ప్రశాంతంగా సాగదు కదా అన్న అర్థంలో ఆకాశ్ దీప్ చమత్కారంగా కామెంట్స్ చేశాడు. ఐపీఎల్‌లో గుర్తింపు తెచ్చుకున్న ఆకాశ్ దీప్, డొమెస్టిక్ క్రికెట్‌లోనూ రాణించి టీమిండియాలో చోటు దక్కించుకున్నాడు. ముఖ్యంగా టెస్టు జట్టులో చోటు దక్కించుకున్న ఆకాశ్ దీప్ అదే స్థాయిలో రాణించాడు. ఇప్పటి వరకు పది టెస్టు మ్యాచ్‌లు ఆడిన ఆకాశ్.. 28 వికెట్లు పడగొట్టాడు. ఒక్క ఇన్నింగ్స్‌లో 6/60.. ఒక్క మ్యాచ్‌లో 10/112తో అత్యుత్తమ ప్రదర్శన చేశాడు. గతేడాది ఇంగ్లండ్ వేదికగా జరిగిన అండర్సన్ - టెండూల్కర్ సిరీస్‌లో బర్మింగ్ హామ్ టెస్టులో 12 వికెట్లు పడగొట్టి పేరు తెచ్చుకున్నాడు. ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్ ఆకాశ్ దీప్‌ను దక్కించుకుంది. అయితే వెన్ను నొప్పి కారణంగా అతను సీజన్ మొత్తానికి దూరమవ్వాల్సిన పరిస్థితి వచ్చింది. ఇదే కారణంతో టీమిండియాలోనూ చోటు కోల్పోయాడు. ప్రస్తుతం గాయం నుంచి కోలుకునే పనిలో ఉన్న ఆకాశ్ దీప్.. ప్రస్తుతం పెళ్లి హడావుడిలో మునిగిపోయాడు. ఆకాశ్ దీప్ పెళ్లి ఫొటోలు, వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి.

## వైభవ్ సూర్యవంశీకి ప్రత్యేక డ్రెస్సింగ్ రూమ్



భారత సీనియర్ క్రికెట్ జట్టులోకి దూసుకొచ్చిన 15 ఏళ్ల ఓపెనింగ్ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ అరంగేట్రానికి ముందే అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. త్వరలో జరగబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం భారత జట్టులో చోటు దక్కించుకున్న ఈ టీనేజ్ స్టార్, బ్రిటన్ పర్యటనలో ఒక వింతైన పరిస్థితిని ఎదుర్కోబోతున్నాడు. అతను మైనర్ (చిన్నపిల్లవాడు) కావడంతో అక్కడి 'మైనర్ల రక్షణ నిబంధనల' ( ప్రకారం అతనికి పర్యటన పొడవునా ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. యునైటెడ్ కింగ్‌డమ్ క్రికెట్ నిబంధనల ప్రకారం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీని 'అండర్-16' ఆటగాడిగా (మైనర్‌గా) పరిగణిస్తారు, పెద్దవాడిగా కాదు. బ్రిటన్ చట్టాల ప్రకారం మైనర్లయిన ఆటగాళ్లు వయసులో పెద్దవారైన మిగతా జట్టు సభ్యులతో కలిసి డ్రెస్సింగ్ రూమ్‌లను గానీ, షవర్ (స్నానపు) గదులను గానీ పంచుకోవడానికి వీల్లేదు. ఇది ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు యొక్క భద్రతా ఫ్రేమ్‌వర్క్‌లో ఒక భాగం. 16 ఏళ్ల లోపు ఉన్న ఆటగాళ్లు పెద్దలతో కలిసి ఒకే డ్రెస్సింగ్ రూమ్ వాడటాన్ని ఇది నిషేధిస్తుంది. స్వతంత్ర క్రికెట్ నియంత్రణ సంస్థ తో పాటు మ్యాచ్‌లు జరిగే స్టేడియాల సేఫ్‌గార్డింగ్ అధికారులు ఈ నియమాలను పర్యవేక్షిస్తారు. ఈ ఆంక్షలు ఉన్నప్పటికీ, వైభవ్ సూర్యవంశీ జట్టులోని మిగతా సభ్యులతో కలిసి టీమ్ మీటింగ్‌లు, వ్యూహాత్మక చర్చలు, వార్మ్-అప్ సెషన్లు, మ్యాచ్ రోజున జరిగే అన్ని కార్యక్రమాల్లోనూ సాధారణంగానే పాల్గొంటాడు. ఈ పరిమితులు కేవలం మ్యాచ్ దుస్తులు మార్చుకునేటప్పుడు లేదా షవర్ ఉపయోగించేటప్పుడు మాత్రమే వర్తిస్తాయి. ఆ సమయంలో అతనికి కేటాయించిన ప్రత్యేక ప్రైవేట్ గదిని ఉపయోగించాలి. ఒకవేళ ప్రధాన డ్రెస్సింగ్ రూమ్‌ను ఉపయోగించాల్సి వస్తే, మిగతా ఆటగాళ్లు ఎవరూ లేని సమయంలో నిర్దేశిత టైంలో మాత్రమే అతనికి అనుమతి ఉంటుంది. భారత్-ఇంగ్లాండ్ సిరీస్ అనేది రెండు దేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక సిరీస్ మాత్రమే కానీ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ నిర్వహించే టోర్నమెంట్ కాదు. కాబట్టి ఈ విషయంలో ఐసీసీకి ఎలాంటి అధికారం ఉండదని నివేదికలు స్పష్టం చేశాయి. "ఈ సేఫ్‌గార్డింగ్ నిబంధనలు ద్వైపాక్షిక సిరీస్‌లకు వర్తించవు. భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ సిరీస్ ఐసీసీ ఈవెంట్ కాదు కాబట్టి అండర్-16 క్రికెటర్ల కోసం ప్రత్యేక ఐసీసీ రూల్స్ ఏవీ లేవు. ఇది పూర్తిగా యూకే దేశ చట్టం, ఇందులో ఐసీసీ జోక్యం చేసుకోలేదు" అని హిందుస్థాన్ టైమ్స్ పత్రిక ఒక అధికారిక ప్రతినిధి మాటలను ఉటంకించింది. భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు వెళ్లినప్పుడు కూడా ఇదే రకమైన నిబంధనలను పాటిస్తామని 'క్రికెట్ ఐర్లాండ్' స్పష్టం చేసింది. క్రికెట్ ఐర్లాండ్ ప్రతినిధి మాట్లాడుతూ.. "పెవిలియన్‌లో భారత జట్టు కోసం మూడు విడివిడి గదులను కేటాయించాం, అలాగే సేఫ్‌గార్డింగ్ చట్టాల గురించి వారికి వివరించాం. నిబంధనలన్నీ సక్రమంగా అమలు జరిగేలా మేము పర్యవేక్షిస్తాం.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609